
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 13.01.2017, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 32 పేజీలు : 12, వెల : ₹ 5



# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

## ఉచిత విద్య, వైద్యంతోనే...

# పేదలకు పెద్దపండుగ



పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ... ఆధునిక భారత నిర్మాత.
లాల్‌బహుదూర్ శాస్త్రి... నిజాయితీకి ప్రతీక.
శ్రీమతి ఇందిరాగాంధీ... బ్యాంకుల జాతీయకరణ.
రాజీవ్‌గాంధీ... సాంకేతిక విప్లవం.
పి.వి.నరసింహారావు... ఆర్థిక సంస్కరణలు.
వాజ్‌పేయి... స్వర్ణ చతుర్భుజితో దేశమంతా నాలుగులైన్ల జాతీయరహదారులు
మన్మోహన్‌సింగ్... 2జీ స్కాం, బొగ్గు స్కాం...

**భారతదేశ ప్రధానులుగా పనిచేసిన నాయకులందరూ తమ పాలనా కాలంలో ఒక్కో అంశంపై తమ బ్రాండ్ వేసుకున్నారు. వీరి పేర్లు తలచుకోగానే పైన సూచించిన అంశాలు గుర్తుకువస్తాయి.**

మరి ప్రధానిగా రెండున్నరేళ్ల పాలనా కాలంలోనే నరేంద్ర మోడీ ఈ తరం ప్రజలే కాదు, రాబోయే తరాల వారు కూడా గుర్తుంచుకునే విధంగా ఒక బలమైన ముద్ర వేసుకున్నారు. అదే పెద్దనోట్ల రద్దు. స్వతంత్ర భారత చరిత్రలో దేశ ప్రజలు కొన్ని ఉత్పాతాలను ఎదుర్కొన్నారు. చైనాతో ఒక యుద్ధం, పాకిస్థాన్‌తో మూడు యుద్ధాలు, ఇందిరాగాంధీ హయాంలో ఎమర్జెనీ వంటివ... అయితే వీటి మూలంగా దేశం యావత్తు ఇబ్బంది పడిన దాఖలాలు లేవు. ఎమర్జెన్సీ సమయంలో ఇందిరాగాంధీ వ్యతిరేకులు మాత్రమే కష్టాలు పడ్డారు. దేశ చరిత్రలో తొలిసారిగా దేశంలో వున్న (మిగతా 11వ పేజీలో)






# ఆరోగ్యమే మహాభాగ్యం

- 'జన్మభూమి' సభలో చంద్రబాబు సూక్తులు
- పర్యటన ఖర్చు ఘనం... ఫలితం శూన్యం
- చెన్నూరుకు కొద్దిపాటి వరాలు

3లో



## కాకమ్మ కథలు చెప్పిన...

# కాకాణి కథ ముగిసింది



## • చిత్తూరోడి చేతిలో చిత్తైపోయాడు

**నకిలీ డాక్యుమెంట్ల కథ కంచికి చేరింది. డాక్యుమెంట్ల సృష్టికర్తలు కటకటాల వెనుకకు చేరారు. సోమిరెడ్డికి విదేశాలలో వెయ్యికోట్ల ఆస్తులున్నాయంటూ కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేసిన ఆరోపణలన్నీ ఆగమే అని తేలిపోయింది. అంతర్జాతీయస్థాయిలో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించడంలో ఆరితేరిన అంతర్జాతీయ నేరగాడిని, అతడికి సహకరించిన మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.**

గత రెండువారాలుగా జిల్లా రాజకీయ రంగంలో అత్యంత చర్చనీయాంశంగా మారిన 'సర్వేపల్లి' సమరానికి ముగింపు కార్డు పడింది. సోమిరెడ్డికి విదేశాలలో వెయ్యికోట్ల అక్రమ ఆస్తులు వున్నాయంటూ సర్వేపల్లి శాసనసభ్యుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేసిన ఆరోపణల కథ అడ్డం తిరిగింది. చిత్తూరుకు చెందిన నకిలీ డాక్యుమెంట్ల సృష్టికర్త చిరంజీవి అలియాస్ మణిమోహన్ అరెస్టుతో కాకాణి కథ ముగిసిపోయింది. ఈ డాక్యుమెంట్లు, తన ఆరోపణలు అసలు కాదు నకిలీ అని రుజువైతే తక్షణమే రాజకీయ సన్యాసం స్వీకరిస్తానని కాకాణి చేసిన భీషణ ప్రతిజ్ఞ ఆచరణకు సమయం ఆసన్నమైంది.

పోలీసులు సేకరించిన సమాచారాన్ని బట్టి చూస్తే చిత్తూరుజిల్లాకు చెందిన మణిమోహన్ అనే వ్యక్తికి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించడమే పని. తన అసలు పేరు చిరంజీవి అయినప్పటికీ దానిని మణిమోహన్‌గా మార్చుకుని నకిలీ పాస్‌పోర్టుతో విదేశీయానం కూడా చేసిన ఘనచరిత్ర ఇతనిది. మలేషియాలోని జంటింగ్ ఐలాండ్‌లోని ఓ క్యాసినోలో ఇతడు చిరుద్యోగి. అక్కడ జూదం కోసం వచ్చే కోటీశ్వరులని చూసి తాను కూడా రాత్రికి రాత్రే కోటీశ్వరుడిని కావాలనే ఆశతో ఈ నకిలీ డాక్యుమెంట్ల రూపకర్తగా ఇతను అవతరించాడు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్ర, జమ్మూలతో పాటు ఇతర రాష్ట్రాలలోని రాజకీయ నాయకుల విశేషాలను ఇంటర్నెట్ ద్వారా తెలుసుకోవడం మణిమోహన్ దినచర్య. ఏయే రాష్ట్రాలలో ఎవరెవరి మధ్య (మిగతా 11వ పేజీలో)






# పందెంకోళ్ళు రెడీ

సంక్రాంతి అంటేనే సరదాల పండుగ. కేవలం తెలుగు సంస్కృతిలోనే కనిపించే ఈ సరదాలను ఇంకెక్కడా చూడలేము. బుడబుక్కలవాళ్ళు, గంగిరెద్దులు, హరిదాసులు, జంగమదేవరలు, ఎడ్లపందేలు, పశువుల పూజలు, పొంగళ్ళు, పిండి వంటలు, భోగి మంటలు, కొత్తబట్టలు... ఇవన్నీ ఒకెత్తయితే సంక్రాంతి స్పెషల్ కోడిపందేలు! ఈ పందేలు అనగానే మనకు గుర్తొచ్చేది గోదావరి జిల్లాలు. అక్కడి రాజులు ఆడే కోడిపందేలు! ఈ పందేల కోసం వాళ్ళు దాదాపు అయిదారు నెలల నుండే పందెపుకోళ్ళను మేపుతుంటారు. ప్రతి సంవత్సరం కోళ్ల పందేలను నిషేధించడం, అయినా ప్రతిచోటా లెక్కచేయకుండా వీటిని నిర్వహించడం. ప్రజాప్రతినిధులు సైతం ఈ పందేలకు హాజరవుతుండడం... ఒక ఆనవాయితీగా మారింది.

అయితే ఈసారి ఉన్నత న్యాయస్థానమే కోళ్ల పందేల రాయుళ్లకు రిలీఫ్ ఇచ్చింది. కోళ్ల కాళ్లకు కత్తులు కట్టకుండా పందేలు నిర్వహించుకోండని చెప్పింది. కోర్టులు ఆ మాత్రం అవకాశమివ్వాలేగాని మన వాళ్లు రెచ్చిపోరూ...

ప్రతి సంవత్సరం నెల్లూరుజిల్లాలోని పలు గ్రామాలు, పల్లెల్లో కూడా కోడి పందేలను చాటుమాటుగా నిర్వహించేవాళ్లు. పోలీసులు వాటిపై దాడులు చేసి దొరికిన డబ్బుతో పాటు దొరికిన కోళ్లను తెచ్చి స్టేషన్‌లో పెట్టేవాళ్లు. ఈసారి కోర్టు ఇచ్చిన రిలీఫ్‌తో నెల్లూరుజిల్లాలో కూడా జోరుగా కోడి పందేలు నిర్వహించనున్నారు. ఈమేరకు కోళ్లను సిద్ధం చేసుకుంటున్నారు. ఉదయగిరి, రాపూరు, ఆత్మకూరు, అల్లూరు, నెల్లూరు రూరల్‌లోని గ్రామాలలో ఈ కోళ్లపందేలు బాగా నిర్వహిస్తుంటారు.

# భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి



ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం నెల్లూరుజిల్లాలోని వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నెల్లూరు నగరంలోని వివిధ వైష్ణవాలయాల్లో క్షేత్రపాలకులు ఉత్తరద్వారంలో కొలువుతీరి భక్తులకు దర్శనమిచ్చారు. నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారు తెల్లవారు జామున 4.20గంటలకు భక్తులకు ఉత్తర ద్వారంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకుల ఆధ్వర్యంలో ధనుర్మాస నిత్యారాధన, మహానివేదన, తిరుప్పావై స్తోత్ర పారాయణం జరిగింది. జిల్లా నలుమూలల నుండి వేలాదిగా భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ, జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ దంపతులు, ఎమ్మెల్సీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఆర్టీఓ వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి, చాట్ల నరసింహారావు, దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్, కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మెన్ మంచికంటి సుధాకర్‌రావు, ఇఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు.

మూలాపేటలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామివారు వైకుంఠ ద్వారంలో దర్శనమిచ్చారు. స్వామి వార్లను విశేషంగా అలంకరించి ఉత్తరద్వారం నుంచి ఊరేగింపుగా ఆలయ ప్రాంగణంలోనికి మంగళవాయిద్యాల నడుమ తీసుకొచ్చారు. అనంతరం స్వామివారికి నగరోత్సవం జరిగింది. దేవస్థాన ఛైర్మెన్, మేనేజింగ్ ట్రస్టీ ఆనం చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవస్థాపక మండలి సభ్యులు మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, తుమ్మల సుబ్బారెడ్డి, ఆనం రంగమయూర్ రెడ్డి ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.

మాగుంట లే అవుట్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో తెల్లవారు జామున స్వామివారిని ఉత్తరద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గరుడ వాహనం పై కొలువుదీరిన స్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. వేదాయపాలెం సద్గురు త్యాగరాజ మందిరం, బారకాసు శ్రీ రామ మందిరం, దర్గామిట్ట శబరి శ్రీరామక్షేత్రం తదితర వైష్ణవాలయాల్లో విశేషపూజలు నిర్వహించారు. భక్తులు వేలాదిగా పాల్గొని స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

# వృత్తి నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి




ప్రతి ఒక్కరూ వృత్తి నైపుణ్య శిక్షణను అభివృద్ధి చేసుకోవాలని, తద్వారా ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఈ నెల 7న ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వెంకటగిరిలోని వివిఆర్‌జెసి మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన ఏపిఎస్ఎస్‌డిసి మెగా ఉద్యోగ మేళా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ జాబ్ మేళాను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. విక్రమసింహపురి వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వీరయ్య మాట్లాడుతూ, నైపుణ్యాభివృద్ధి సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. మునిసిపల్ ఛైర్‌పర్సన్ దొంతు శారద మాట్లాడుతూ, యువత ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొని, నైపుణ్యాభివృద్ధి సంస్థ సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఏపిఎస్ఎస్‌డిసి రీజనల్ మేనేజర్ ఆర్.లోకనాథం మాట్లాడుతూ, నిరుద్యోగ యువత ఈ ఉద్యోగమేళాలో పాల్గొనాలని, ఎంపిక కానివారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారి ప్రతిభను మెరుగుపరచి, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. కాగా, 10 నుంచి పి.జి దాకా చదివినవారు మొత్తం 726 మంది ఈ జాబ్ మేళాకు హాజరు కాగా, అందులో 367మంది ఎంపికయ్యారు. 17 సంస్థల ప్రతినిధులు పాల్గొని అర్హులను ఎంపికచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిఆర్‌జెసి ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ సురేష్‌కుమార్ గింది, వైటిసి సెంటర్ మేనేజర్ సంజీవరావు, భాగ్యశ్రీ, సతీష్, శివ, జనార్ధన్, మస్తాన్, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ పింఛన్లు, రేషన్‌కార్డులు

**- ఎమ్మెల్సీ సోమిరెడ్డి**



ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషిచేస్తోందని, రాష్ట్రం ఒకవైపు ఎన్నో ఆర్థిక ఇబ్బందుల్లో వున్నప్పటికీ ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం అనేక రకాల పథకాలను చేపట్టి అమలుచేస్తోందని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఈనెల 7న ఆయన మనుబోలులో జరిగిన జన్మభూమి-మావూరు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ, జన్మభూమి-మావూరు కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రజా సమస్యలను పరిష్కరిస్తోందని, అర్హత వున్న ప్రజలందరికీ పింఛన్లు, రేషన్‌కార్డులు అందజేస్తోందని అన్నారు. చంద్రన్న బీమా పథకం పేదప్రజలకు ఎంతో ఉపయోగకరమైనదని, నిరుపేదలైన ప్రజలకు ఎలాంటి ప్రీమియం లేకుండానే 5 లక్షల రూపాయల బీమాని చెల్లించడం జరుగుతోందన్నారు. ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత రెండున్నర సంవత్సరాలుగా ప్రజల అభ్యున్నతికోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. 2017 జూన్ నాటికి ప్రతి ఒక్కరూ గ్యాస్ కనెక్షన్ పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు మాట్లాడుతూ, జన్మభూమి-మావూరు కార్యక్రమంలో ప్రజల వద్ద నుంచి అందిన ధరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి కంప్యూటర్లో అప్‌లోడ్ చేయడం జరుగుతోందన్నారు. కొన్ని సమస్యలను ఇప్పటికే పరిష్కరించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులైన పలువురు మత్స్యకారులకు ఆటోలు, మోపెడ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ హేమలత, తహశీల్దార్ కెవి రమణయ్య, టాస్క్‌ఫోర్స్ అధికారి కృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ కె.పద్మమ్మ, జడ్పీటిసి సభ్యులు రమేష్, వెంకటశేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# క్యాలెండర్ మారింది... కష్టాలు మారలేదు



ప్రజల జీవితాల్లో క్యాలెండర్ మారింది. కష్టాలు మాత్రం మారలేదు. కొత్తనోట్లతో పాటు ఇంటికి కొత్త క్యాలెండర్లు కూడా వచ్చాయి. కరెన్సీ అగచాట్లు కామన్‌గానే కొనసాగుతున్నాయి. 2016సంవత్సరం వెళ్లిపోయింది. 2017కు స్వాగతం పలికాము. డిసెంబర్31వతేదీతో కరెన్సీ కష్టాలు ముగిసినట్లేనని భావించారు. 31వ తేదీ ప్రధాని శుభవార్త చెబుతాడని, ఈ కరెన్సీ కష్టాలకు ఇక్కడితో ముగింపు పలికినట్లేనని అనుకున్నారు. తీరాచూస్తే 31వ తేదీ ప్రధాని ప్రసంగం పేలవంగా సాగింది. కరెన్సీ రిలీఫ్ గురించి ఆయన ఏమీ చెప్పలేదు. నగదు విత్‌డ్రాపై పరిమితులు యధావిధంగా ఉన్నాయి. ఏటిఎంల ముందు 'క్యూ'లు కొనసాగుతున్నాయి. కాకపోతే ఏటిఎం ద్వారా నగదు విత్‌డ్రాను 4500 రూపాయలకు పెంచారు. ఇక బ్యాంకుల్లో వారానికి 24వేలు మాత్రమే విత్‌డ్రా చేసుకునే పరంపరను కొనసాగిస్తున్నారు. కొత్తనోట్లు తగినంతగా అందించలేక ప్రభుత్వం డిజిటల్ కరెన్సీని ప్రోత్సహిస్తోంది. అయితే డిజిటల్ కరెన్సీకి ప్రజలు పూర్తి స్థాయిలో అలవాటు పడేదాకా వ్యాపారాల పరిస్థితి ఏంటి? అన్ని రకాల వ్యాపారాల్లోనూ ప్రతిష్టంభన కొనసాగుతోంది. కొత్త సంవత్సరం ఆరంభంలోనన్నా కరెన్సీ కష్టాలు తొలుగుతాయని భావించిన ప్రజలకు నిరాశే మిగిలింది.

# వేడుకగా సంక్రాంతి ముగ్గుల పోటీ



సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఈ నెల 7న నెల్లూరులోని ఆదిత్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీ నిర్వహించారు. ఆదిత్యకళాశాల విద్యార్థినులు, ఆదిత్య నగర్, రాంజీనగర్ వాసులు సుమారు యాభై మంది ఈ పోటీలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఎం.పావని ప్రథమస్థానం సాధించగా, వై. పల్లవి, టి.ప్రమీల ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. పోటీలో పాల్గొన్నవారందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా పుట్టం విజయనిర్మల, మంచికంటి మానసవీణ, బొగ్గరపు ఇందిరాకృష్ణ, శైలజ వ్యవహరించారు. జనవరి26న రిపబ్లిక్ దినోత్సవం నాడు బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని ఆదిత్య విద్యాసంస్థల అధినేత ఆచార్య ఆదిత్య, కళాశాల డైరెక్టర్ మంచికంటి కృష్ణ పేర్కొన్నారు.



# శ్రీసిటీలో తెలంగాణ పారిశ్రామికవేత్తలు

పదిమందితో కూడిన తెలంగాణ పారిశ్రామికవేత్తల బృందం సోమవారం శ్రీసిటీని సందర్శించింది. తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(టిఎస్ఐఐసి) ఛైర్మెన్ బాలమల్లు నేతృత్వంలో వీరి పర్యటన సాగింది. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక విధానాలు ప్రతిబింబించేలా ఓ చక్కని పారిశ్రామికవాడ ఏర్పాటులో భాగంగా వీరు దేశంలోని కొన్ని ప్రముఖ పారిశ్రామికవాడలను సందర్శించి, వాటి పనితీరును అధ్యయనం చేసేందుకు సంకల్పించారు. ఈ క్రమంలో మొట్టమొదటగా శ్రీసిటీని వీరు సందర్శించారు. శ్రీసిటీ ప్రెసిడెంట్ రమేష్ సుబ్రహ్మణ్యం వీరికి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీలో మౌళిక వసతులు, పారిశ్రామికప్రగతిని వారికి వివరించారు. బిజినెస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ బృందంలోని సభ్యులు లేవనెత్తిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. శ్రీసిటీ ఎంతో అద్భుతంగా ఉందని వీరు కొనియాడారు. వీరి పర్యటనపట్ల శ్రీసిటి ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి హర్షం వ్యక్తంచేశారు.

# గర్భిణుల కోసం ఉచిత ఆటోలు

## • మాగుంట శరత్ సేవాసమితి మానవతా సేవలు



పేద గర్భిణీ స్త్రీలు నగరంలో ఎక్కడికి వెళ్ళాలన్నా ఆటోల కోసం పడుతున్న ఇబ్బందులను గమనించి, నెల్లూరులోని మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవా సమితి ఆధ్వర్యంలో పేద గర్భిణీ స్త్రీలకు ఉచితంగా అయిదు ఆటోలను కేటాయించేందుకు నిర్ణయించుకున్నారు. ఆ ఆటోలను యువజన సేవాసమితి వ్యవస్థాపకుడు మాగుంట శరత్‌చంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ప్రసాద్‌ను ఆయన అభినందించారు. ఈ ఉచిత ఆటోలు నగరమంతా తిరుగుతాయని, వాటిపై ఫోన్ నంబరు కూడా వుంటుందని, అవసరమైనవారు ఫోన్ చేస్తే వెంటనే తమ ఆటో వస్తుందని నిర్వాహకులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగేంద్ర, ప్రసాద్, దారా మహేష్, మాదా బాబు, జైరాజ్, రమేష్, నాగార్జున, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం

## • జన్మభూమి సభలో సీఎం ఉద్బోధ





***నన్ను చూడండి ఎంత ఉల్లాసంగా ఉన్నానో, నన్ను చూడండి ఎంత ఉత్సాహంగా ఉన్నానో... ఇందుకు కారణం నా ఆరోగ్యమే! రోజూ యోగా చేస్తాను. రాగి జావ, జొన్నరొట్టె, డ్రైఫ్రూట్స్, గుడ్డు నా ఫుడ్డు. మజ్జిగ తాగుతాను... మీరు కూడా ఇవే తినండి, యోగా చేయండి... ఆరోగ్యంగా ఉంటారు.***

వేలాదిమంది పోలీసు సిబ్బంది, వందలాదిమంది అధికారులు, వేల సంఖ్యలో తరలించిన ప్రజలు... కోట్ల రూపాయల ఖర్చు... ఇంత ఖర్చు చేసి ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిందేంటంటే ప్రజలకు ఆరోగ్య సూత్రాలు. ఈ ఆరోగ్యసూత్రాలను ముఖ్యమంత్రి చెప్పాలా? పొద్దున్నే మా టీవీ పెడితే మంతెన సత్యనారాయణ రాజు అదేపనిగా చెబుతున్నాడు. సివిఆర్ హెల్త్ ఛానెల్ పెడితే 24గంటలూ అవే వార్తలు. ఇక ఏ పత్రిక చూసినా హెల్త్ టిప్స్‌పై శీర్షికలే... ఒక ముఖ్యమంత్రి వచ్చి వీటిని చెప్పనవసరం లేదు. 10వ తేదీ గూడూరు మండలం చెన్నూరులో నిర్వహించిన 'జన్మభూమి–మా ఊరు' సభలో పాల్గొన్న చంద్రబాబు ఆరోగ్య విషయాలను గురించి ఎక్కువగా చెప్పారు. అలాగే పుట్టిన శిశువు నుండి చచ్చి శవమైన మనిషి వరకు తాను ఎన్నో చేస్తున్నాను కాబట్టి ప్రతి ఒక్కరూ తన పట్ల కృతజ్ఞులై ఉండాలని, ఇకముందు కూడా తనను ఆశీర్వదించాలని ఒకటికి నాలుగుసార్లు చెప్పుకున్నారు.

ఒక ముఖ్యమంత్రి ఒకచోట పర్యటనకు వెళితే అది అభివృద్ధికి బాటగా మారాలి. చెన్నూరు సభలో చంద్రబాబు స్వోత్కర్షను వచ్చిన జనం భరించలేక పోయారు. ప్రతిసభలో చెప్పే రొటీన్ సోదె ఇక్కడా చెప్పారు. చెన్నూరు గ్రామానికి మాత్రం షాదీమంజిల్, టిటిడి కళ్యాణ మండపం, మినీ స్టేడియం, ఇంటింటికీ మరుగుదొడ్డి వరాలిచ్చారు. మున్సిపల్ స్కూళ్లలో తెలుగు మీడియంను తగులబెట్టి ఇంగ్లీష్ మీడియంను అంటగట్టిన మంత్రి పి.నారాయణను చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో పి.నారాయణ, సిద్ధా రాఘవరావు, తిరుపతి ఎంపి వరప్రసాద్, శాసనమండలి సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, వాకాటి నారాయణరెడ్డి, టిటిడి ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి, ఎమ్మెల్యేలు పాశం సునీల్, కురుగొండ్ల రామకృష్ణ, బొల్లినేని రామారావు, మాజీమంత్రులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పరసా రత్నం, మాజీఎమ్మెల్యేలు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కంభం విజయరామిరెడ్డి, జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు





# 'రేస్'లో సంక్రాంతి కిరణాలు




నెల్లూరు సరస్వతినగర్‌లో వున్న డా.కిషోర్స్ రత్నం కిడ్స్ మరియు 'రేస్' ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈనెల 10న ముందస్తు సంక్రాంతి శోభ సంతరించుకుంది. సంక్రాంతి పండుగను విద్యార్థులు సంప్రదాయపద్ధతిలో ఆనందోత్సాహాల మధ్య వేడుకగా నిర్వహించుకున్నారు. పాఠశాల ప్రాంగణలో రంగుల హరివిల్లు, ముత్యాల ముగ్గులతో, గొబ్బెమ్మలతో అలంకరించారు. రంగురంగుల గాలిపటాలను ఎగురవేశారు. విద్యార్థులంతా సంప్రదాయ దుస్తులను ధరించి పండుగ విశిష్టతను ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డా. కిషోర్స్ రత్నం జెన్‌నెక్స్ట్ స్కూల్స్ జనరల్ మేనేజర్ రామమూర్తి నాయుడు, సీనియర్ మేనేజర్ రాజేష్‌బాబు, రేస్ ప్రిన్సిపాల్ జాస్మిన్, కిడ్స్ ప్రిన్సిపాల్ లక్ష్మితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## 'ప్రభా'తం

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సమరానికి ఎన్నికల కమిషన్ పచ్చజెండా ఊపింది. ఫిబ్రవరి 4వ తేదీ తొలిదశ పోలింగ్‌తో మొదలయ్యే ఈ సంగ్రామం మార్చి 11వ తేదీ ఓట్ల లెక్కింపుతో ముగుస్తుంది. ఉత్తరప్రదేశ్(403), పంజాబ్(117), ఉత్తరాఖండ్(70), మణిపూర్(60), గోవా(40)... మొత్తం 5 రాష్ట్రాల ఎన్నికల్లో ఆయా పార్టీలు తమ భవిష్యత్‌ను తేల్చుకోబోతున్నాయి.

సాధారణంగా పార్లమెంట్ ఎన్నికలకు ముందొచ్చే ఇలాంటి అసెంబ్లీ ఎన్నికలను ఆయా ప్రభుత్వాలు లేదా పార్టీల పనితీరుకు రెఫరెండంగా భావిస్తుంటారు. వీటినే సెమీఫైనల్స్ అని కూడా అంటుంటారు. అయితే ఈసారి జరిగే ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికలకు ఓ ప్రత్యేకత వుంది. పలు పార్టీలకు ఇవి సెమీఫైనల్సే కావచ్చునేమో... ప్రధాని నరేంద్ర మోడీకి మాత్రం ఇవి ఫైనల్స్ లాంటివే!

దేశంలో పెద్దనోట్ల రద్దు తర్వాత, పాక్ పై సర్జికల్ దాడుల తర్వాత జరుగుతున్న ఎన్నికలివి. పెద్దనోట్ల రద్దు, సర్జికల్ దాడుల విషయంలో ప్రభుత్వం కంటే కూడా ప్రధాని నరేంద్రమోడీ ఎక్కువ ఫోకస్ అయ్యారు. ఆయన వ్యక్తిగత నిర్ణయాలుగానే ఇవి ప్రచారంలోకి వచ్చాయి. సర్జికల్ దాడులను ప్రజలు ఆమోదిస్తారు. కాని పెద్దనోట్ల రద్దును స్వాగతించారా? దీనికి కొలమానమే ఈ ఎన్నికలు. పెద్దనోట్ల రద్దు దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపింది. దేశంలో ఎక్కువ శాతంమంది ప్రజలు ఎంతో కొంత ఇబ్బందికి గురయ్యారు. ఈ ఇబ్బందులను అధిగమిస్తే అవినీతి, నల్లధనం లేని స్వచ్ఛభారత్‌ను నిర్మించవచ్చంటూ ప్రధాని నమ్మకంగా చెబుతూ వచ్చారు. మరి ఆయన మాటలను ప్రజలు ఎంతగా విశ్వసించారన్నది ఈ ఎన్నికల్లో తేలబోతోంది.

### మోడీకి ఫైనల్సే...



**పెద్దనోట్ల రద్దు దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపింది. దేశంలో ఎక్కువ శాతం మంది ప్రజలు ఎంతో కొంత ఇబ్బందికి గురయ్యారు. ఈ ఇబ్బందులను అధిగమిస్తే అవినీతి, నల్లధనం లేని స్వచ్ఛభారత్‌ను నిర్మించవచ్చంటూ ప్రధాని నమ్మకంగా చెబుతూ వచ్చారు. మరి ఆయన మాటలను ప్రజలు ఎంతగా విశ్వసించారన్నది ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్, గోవా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో తేలబోతోంది.**

సాధారణంగా ఏ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనైనా అక్కడి స్థానిక సమస్యలే ప్రభావం చూపాలి. ఫలితాలు కూడా ఆ రాష్ట్రంలో వున్న ప్రభుత్వానికి అనుకూలంగానో లేక వ్యతిరేకంగానో ఉండాలి. లోక్‌సభ ఎన్నికల ప్రాధాన్యత వేరు. అసెంబ్లీ ఎన్నికల ప్రాధాన్యత వేరుగా ఉంటుంది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీహార్‌లో బీజేపీ అనూహ్యంగా దాదాపు అన్ని సీట్లను గెలుచుకుంది. అలాగే ఢిల్లీలోనూ 8 లోక్‌సభ స్థానాలలో ఏడింటిని గెలుచుకుంది. అయితే ఆ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకొచ్చేసరికి పరిస్థితి మారిపోయింది. బీహార్ అసెంబ్లీలో జెడి(యు) ఆర్జేడీ కూటమి బీజేపీని తుడిచిపెట్టినందుకు కారణం అక్కడ ప్రాంతీయ పరిస్థితులు. అక్కడ ప్రజల్లో నితీష్ ప్రభుత్వంపై వ్యతిరేకత లేదు. నితీష్‌కు ప్రజాదరణ వుంది. కాబట్టే మోడీని దేశ ప్రధాని కావాలనుకున్న బీహార్ ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటేసారు. ఏడాది తర్వాత తమ ముఖ్యమంత్రిగా నితీష్‌కుమార్ ఉండాలని కోరుకున్న ఆ రాష్ట్ర ప్రజలు దళ్(యు) కూటమిని గెలిపించారు. ఢిల్లీలోనూ ఇదే సీన్. లోక్‌సభ ఎన్నికల్లో మోడీకి జైకొట్టిన ఢిల్లీ వాసులు, అసెంబ్లీ ఎన్నికలొచ్చేసరికి బీజేపీ కంటే ఆప్ వైపే మొగ్గు చూపారు.

కాబట్టి రేపు జరగబోయే ఐదు రాష్ట్రాలలో కూడా ఆయా ప్రభుత్వాల పట్ల అనుకూల, లేదా వ్యతిరేకత ప్రభావం చూపవచ్చు. దీంతోపాటు జాతీయ ప్రాధాన్యత అంశమైన నోట్ల రద్దు కూడా ఈ ఎన్నికల ఫలితాలపై ఖచ్చితంగా ప్రభావం చూపుతుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు ప్రజలపై పెద్దగా ప్రత్యక్ష ప్రభావం చూపవు. కాని నోట్ల రద్దు ప్రభావం దేశంలో అడుక్కునే వారి దగ్గర నుండి అంబానీ వరకు అందరి మీదా పడింది. ప్రధాని నరేంద్ర మోడీ సైతం పెద్దనోట్ల రద్దును ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో తమ ప్రచారాస్త్రంగానే వాడుకోబోతున్నారు. పెద్దనోట్ల రద్దుతో దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైందన్న విమర్శలను ఆయన పట్టించుకోవడం లేదు. పేదల కోసమే పెద్దనోట్లు రద్దు చేసామంటూ ప్రజల్లోకి పోతున్నారు. పెద్దనోట్లు రద్దు చేసిన తర్వాత పేద ప్రజలకు ఏ విధంగా మేలు జరిగిందన్నది మాత్రం ప్రధానిగాని, ఆయన మంత్రివర్గ సహచరులుగాని, ఆర్‌బిఐ వాళ్లు గాని ఇంతవరకు వెల్లడించలేదు. తమకు ఏ రూపంలో మేలు జరిగిందో కూడా ఇంతవరకు జనానికి అర్థం కావడం లేదు. మరి అర్థంకాని ప్రధాని ప్రచారాన్ని ప్రజలు ఎంతవరకు ఆదరిస్తారు? ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో పేదల కోసం మోడీ ఏదన్నా మ్యాజిక్ చేయబోతున్నారా? ప్రస్తుతం ప్రజల ఆశలు కూడా ఈ ఎన్నికల పైనే!

ముఖ్యంగా యూపి ఎన్నికలు కీలకం కానున్నాయి. ఎక్కువ లోక్‌సభ స్థానాలు, ఎక్కువ అసెంబ్లీ స్థానాలతో పాటూ ఎక్కువ జనాభా వున్న రాష్ట్రం ఇది. ప్రస్తుతం బీజేపీకి ఆ రాష్ట్రంలో ప్రతిపక్ష హోదా కూడా లేదు. కాని ప్రభుత్వంపై కన్నేశారు. దీనికోసం ఎప్పటి నుండో వ్యూహరచన చేస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేకతతో పాటు, సమాజ్‌వాదీ పార్టీలో వచ్చిన అంతర్యుద్ధం బీజేపీకి కలిసొచ్చే అంశాలు. కాబట్టి ఈ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినా, లేదా పెద్ద పార్టీగా అవతరించినా అది మోడీ ఘనతే అవుతుంది. అలాకాకుండా పార్టీ రెండో స్థానానికో మూడో స్థానంలోకి వెళ్లినా అది పెద్దనోట్ల రద్దు ఎఫెక్టే అవుతుంది.

అలాగే ప్రస్తుతం ఎన్నికలు జరిగే గోవాలో బీజేపీ అధికారంలో వుంది. మణిపూర్‌లో ఇటీవలే కాంగ్రెస్ చీలికవర్గంతో బీజేపీ ప్రభుత్వం ఏర్పడింది. పంజాబ్‌లో మిత్రపక్షం శిరోమణి అకాళీదళ్‌తో కలిసి అధికారంలో వుంది. ఉత్తరాఖండ్‌లో మాత్రం కాంగ్రెస్ అధికారంలో వుంది. ఈసారి పంజాబ్, గోవాలలో బీజేపీ, కాంగ్రెస్, ఆప్‌ల మధ్య ముక్కోణపు పోటీ నెలకొంది. ఇది బీజేపీకి ఇబ్బందికర పరిణామమే! ఉత్తరాఖండ్‌లో ప్రభుత్వ వ్యతిరేకత ఉంది కాబట్టి బీజేపీయే రావచ్చు. ఈ ఐదు రాష్ట్రాల్లో యూపితో పాటు మరో రెండు రాష్ట్రాల్లోనన్నా బీజేపీ జెండా ఎగిరితేనే మోడీ పదవి పదిలం! ఆయన నోట్ల రద్దును ప్రజలు ఆదరించినట్లు! యూపితో పాటు మిగతా రాష్ట్రాలలో బీజేపీ చతికిలబడితే మోడీ కుర్చీ క్రిందకే నీళ్ళు ఖాయం.

## రాజీతో పరిష్కారం ఈజీ

**- నెల్లూరుజిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్**

న్యాయ ప్రక్రియలోని మధ్యవర్తిత్వం ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించి కక్షిదారులకు సత్వర పరిష్కారంతో పాటు సమన్యాయం లభిస్తుందని నెల్లూరుజిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మెన్ జునైద్ అహ్మద్ మౌలానా పేర్కొన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అంతర్జాతీయ జాతీయ ప్రాంతీయ మధ్యవర్తిత్వ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరు ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో ఈ నెల 7వ తేదీ మధ్యవర్తిత్వ సంఘటిత రాజీపద్ధతులపై శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ పేద ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వాన్ని అందించడమే




భారత రాజ్యాంగ లక్ష్యమన్నారు. ఇందులో న్యాయవ్యవస్థ ద్వారా ప్రజలందరికీ త్వరితగతిన న్యాయం అందించడం కోసం మధ్యవర్తిత్వ రాజీ పద్ధతులను ప్రవేశ పెట్టామన్నారు. దీని ద్వారా ఇరువర్గాలకు సమాన సత్వరన్యాయం అందుతుందన్నారు. ఈ ప్రక్రియకు చట్టబద్ధత ఉంటుందని, ఆ దిశగా న్యాయవాదులు, న్యాయమూర్తులు, మధ్యవర్తులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. నెల్లూరుజిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా లోక్‌అదాలత్ ద్వారా కేసుల పరిష్కారానికి పోలీసు యంత్రాంగం పూర్తి సహాయ, సహకారాలు అందిస్తుందని, అపరిష్కృతంగా పెరిగిపోతున్న కేసులను వీలైనంత తగ్గించేందుకు ఈ మధ్యవర్తిత్వ మార్గం ఎంతో దోహదం చేస్తుందన్నారు. అనంతరం ప్రాంతీయ కేంద్ర కార్యదర్శి మూర్తి మధ్యవర్తిత్వ ప్రక్రియలోని విధానాలు, పరిష్కార మార్గాలు అవలంభించిన పద్ధతులపై న్యాయమూర్తులు, న్యాయవాదులు, మధ్యవర్తులు, ప్యానల్ లాయర్లకు శిక్షణ తరగతుల్లో అవగాహన కల్పించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సత్యవాణి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జీలు శ్యామలాదేవి, పాపిరెడ్డి, శ్రీరామచంద్రమూర్తి, లక్ష్మి, జిల్లాలోని పలువురు న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఫణిరత్నం, ప్యానల్ న్యాయవాదులు, మధ్యవర్తులు పాల్గొన్నారు.

## అలరించిన సంక్రాంతి కవిసమ్మేళనం

సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని నెల్లూరులోని జిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 8న సంక్రాంతి కవిసమ్మేళనం జరిగింది. స్థానిక టౌన్‌హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు కవులు, కవయిత్రులు పాల్గొని సంక్రాంతి కవితలను వినిపించారు. సభకు జిఆర్ ట్రస్ట్ అధ్యక్షులు గుర్రాల రమణయ్య అధ్యక్షత వహించగా, గౌరవ అతిథులుగా కీర్తిపురస్కార గ్రహీత గుడిబండ వెంకటరెడ్డి, 'సాహితీ కిరణం' సంపాదకుడు పొత్తూరు సుబ్బారావు పాల్గొన్నారు. ప్రముఖ రచయిత్రి పాతూరు అన్నపూర్ణ, బివి నరసింహం, జాప్ జిల్లా కన్వీనర్ ద్వారం వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొని సంక్రాంతి ప్రాశస్త్యాన్ని వివరించారు. అనంతరం, కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మెట్రో టివి క్యాలెండర్‌ను గుడిబండ వెంకటరెడ్డి ఆవిష్కరించారు.




### ఇద్దరూ అవినీతిపరులు కారు

ఇటీవల సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డిల మధ్య రాజకీయ దూషణల పర్వం తీవ్రస్థాయిలో ఉంది. నాకు తెలిసి ఇద్దరూ అవినీతిపరులు కారు. నిఖార్సయిన ప్రజానాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి. ప్రజలకు అందుబాటులో వుండే మనిషి. రాజకీయాల్లో సంపాదించుకున్నది లేదు. కూలీ చేసుకునే వాళ్లకే కోట్లున్న నేటి కాలంలో ఆయన పవర్ ప్రాజెక్ట్‌లో పెట్టుబడులు పెట్టడం పెద్ద సమస్య కాదు. కాకాణి జడ్పీ ఛైర్మెన్‌గా మంచిపేరు తెచ్చుకున్నాడు. రియల్‌ఎస్టేట్‌లో నాలుగు రూపాయలు సంపాదించుకుని వుండొచ్చు. ఇద్దరూ రాజకీయ విమర్శల వరకే పరిమితమైతే బాగుంటుంది.

– వాస్తు రామచంద్ర, నెల్లూరు.

### రైతు బాంధవుడు రాజన్నే!

నక్క వాతలు పెట్టుకున్నంత మాత్రాన పులి అవుతుందా? అట్లాగే చంద్రబాబు రెండు ప్రాజెక్టుల వద్ద నీళ్లకు గేట్లు ఎత్తినంత మాత్రాన రైతు బాంధవుడు కాలేడు. వై.యస్. తన హయాంలో రైతుల బాగు కోసం జలయజ్ఞం ప్రారంభించాడు. ఎన్నో ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లకు రూపకల్పన చేశాడు. ఈరోజు రైతులు నాలుగు రూపాయలు సంపాదించుకుని అంతో ఇంతో బాగున్నారంటే అది వై.యస్ దయే! చంద్రబాబు పట్టిసీమ, పోలవరం, పురుషోత్తమపట్నం ప్రాజెక్టులు రైతుల మీద ప్రేమకంటే ధనాపేక్షతో చేపట్టినవే!

పి. యల్లారెడ్డి, ఆత్మకూరు.

### ఇదేం పని నారాయణా?

మున్సిపల్ బళ్లలో అర్ధాంతరంగా అర్ధ సంవత్సరంలో తెలుగు మీడియాన్ని ఎత్తేస్తూ మున్సిపల్ మంత్రి నారాయణ ఉత్తర్వులు జారీ చేయడం దిగ్భ్రాంతికరం. కార్పొరేట్ చదువుల వ్యాపారంతో కోట్లు సంపాదించే వాళ్లు మంత్రులైతే పరిస్థితులు ఇలాగే తగలబడుతాయి. అసలే ఇలాంటివాళ్ల తయారై తెలుగుకు తెగులు పట్టిస్తున్నారు. కొన్ని స్కూళ్లలో విద్యార్థులు తెలుగు మాట్లాడితే శిక్షిస్తున్నారు. కనీసం ప్రభుత్వ బళ్లలోనన్నా తెలుగు బ్రతికి ఉందనుకుంటుంటే, నారాయణ ఆ ఆశను కూడా చంపేస్తున్నాడు.

వి. నరసింహాచార్యులు, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు.

## క్యాన్సర్ బాధితునికి...
# విపిఆర్ ఆపన్నహస్తం



**ఎందరో బాధితులకు చేయూతనందించి వారి జీవితాల్లో వెలుగులు ప్రసాదించిన ప్రముఖ దాత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఇటీవల క్యాన్సర్‌కు గురైన ఓ తొమ్మిదేళ్ళ బాలుడిని ప్రాణాపాయం నుంచి కాపాడాలనే ఉద్దేశంతో మంచి వైద్యం కోసం లక్ష రూపాయల సాయాన్ని అందించి చిన్నారుల ఆరోగ్యంపై, వారి భవిష్యత్‌పై తనకున్న శ్రద్ధను, మక్కువను చాటుకున్నారు.**

క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న దేవీప్రసాద్ అనే బాలునికి విపిఆర్ ఆపన్న హస్తం అందించారు. వివరాలిలా వున్నాయి. నెల్లూరులోని దర్గామిట్ట రామ్‌నగర్‌కు చెందిన ఇరగటపు బుజ్జయ్య కుమారుడు దేవిప్రసాద్ గత రెండేళ్ళుగా బ్లడ్‌క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. వ్యాధి తీవ్రం కావడంతో గత నాలుగు నెలలుగా అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే, ఆ వ్యాధి చికిత్సకు తగు ఆర్థిక స్తోమతు లేని ఆ తల్లిదండ్రులు తమ బిడ్డకు సాయం చేసి ఆదుకోవాలంటూ విపిఆర్ ఫౌండేషన్‌ను ఆశ్రయించారు. అందుకు స్పందించిన విపిఆర్ ఫౌండేషన్ అధినేత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి తొమ్మిదేళ్ళ బాలుడైన దేవీప్రసాద్‌కు మెరుగైన వైద్యచికిత్సల కోసం లక్ష రూపాయల సాయం అందజేసి తన వితరణగుణాన్ని చాటుకున్నారు. ఆ మేరకు దేవీప్రసాద్ తండ్రికి ఈ నెల 6న లక్షరూపాయల చెక్‌ను అందజేసి ఆ బిడ్డ ఆరోగ్యంగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



## నెల్లూరు జిల్లా ఎమ్మెల్సీ స్థానంపై..
# జగన్ ప్రత్యేకశ్రద్ధ!

- ప్రతాప్ ఆధ్వర్యంలో 'రెడీ' అవుతున్న అభ్యర్థి
- బెంగుళూరులో వైసిపి పందెంకోడి

*త్వరలో జరగబోయే స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నికలపై వైకాపా అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేకశ్రద్ధ చూపిస్తున్నాడు. 2019 ఎన్నికల ప్రచారానికి ఈ ఎన్నికల నుండే శ్రీకారం చుట్టాలని ఆయన భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారపార్టీని అన్ని స్థాయిలలో ఢీ కొట్టే దిశగా స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. తన సొంత జిల్లా అయిన కడప జిల్లా స్థానిక ఎమ్మెల్సీతో పాటు నెల్లూరుజిల్లా ఎమ్మెల్సీని కూడా ఆయన ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కడప జిల్లా అభ్యర్థిగా తన చిన్నాన్న వై.యస్.వివేకానందరెడ్డినే నిలబెట్టబోతున్నారు.*

సొంత జిల్లా కడప తర్వాత వైకాపాకు బలంగా ఉండేది, జగన్‌కు వెన్నుదన్నుగా ఉండేది నెల్లూరుజిల్లానే! ఈ జిల్లా నాయకులు, ఎమ్మెల్యేల మీద కూడా జగన్‌కు నమ్మకమెక్కువ. ఎందుకంటే సొంత జిల్లాలో ఇద్దరు వైకాపా ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ తెలుగుదేశంకు మారారు. కాని నెల్లూరుజిల్లా నుండి ఒకే ఒక్క ఎమ్మెల్యే తెలుగుదేశంలోకి వెళ్లాడు. మిగతా ఎమ్మెల్యేల మీద ఎంత ఒత్తిడి వచ్చినా ఎవరూ పార్టీ మారలేదు.

ఈ జిల్లాలోని తన పార్టీ ఎమ్మెల్యేలు, నాయకుల మీద వున్న నమ్మకంతోనే జగన్ ఈ జిల్లా స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికకు అభ్యర్థిని దించాలనుకుంటున్నాడు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలోనే వైకాపా ఎమ్మెల్సీ అభ్యర్థి తెరమీదకు రానున్నాడు. నెల్లూరుజిల్లాకే చెందిన ఒక రియల్టర్ బెంగుళూరులో ఉంటున్నాడని, అతనినే ప్రతాప్ సూచించాడని సమాచారం. అతను ఎవరైందీ పేరు బయటకు రాలేదు. ఈ ఎన్నికలలో అతను ఓడిపోయినా భవిష్యత్‌లో నామినేటెడ్ ఎమ్మెల్సీ ఇవ్వాలనే హామీతో రంగంలోకి వస్తున్నట్లు సమాచారం. 2014లో స్థానిక సంస్థల ఎన్నికలప్పుడు ఈ జిల్లాలో వైకాపాకే ఎక్కువ ఓట్లుండేవి. తెలుగుదేశం అధికారంలోకి వచ్చాకే వైకాపా నుండి గెలిచిన జడ్పీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు చాలామంది ఆ పార్టీలోకి మారారు. దీంతో తెలుగుదేశం కంటే వైకాపా 50ఓట్లకు పైనే మైనస్‌లో వుంది. అయితే వైకాపా నుండి తెలుగుదేశంలోకి వెళ్లిన వాళ్లంతా ఆ పార్టీ మీద భక్తితోనో, చంద్రబాబు మీద అభిమానంతోనో వెళ్లినోళ్లు కాదు... రాజకీయ అవసరాల కోసం వెళ్లిన వాళ్లే! వీళ్లకు మనసులో జగన్ అంటే అభిమానం వుంది. అదీగాక తెలుగుదేశంలో చేరి వీళ్లు లబ్ధిపొందిందేమీలేదు. అక్కడింకా రోతగా ఉంది. జిల్లాలో వైకాపా ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జ్‌లు ప్రతిష్టాత్మకంగా తీసుకుని గట్టిగా ఎలక్షన్ చేస్తే తెలుగుదేశం వాళ్లకు ముచ్చెమటలు పట్టించవచ్చు.

# సంక్రాంతి బిజీ




సంక్రాంతి సెలవుల నేపథ్యంలో రైళ్లు, బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై వంటి ప్రాంతాల నుండి నెల్లూరుకు వచ్చే బస్సులు, రైళ్లు ఫుల్‌గా వస్తున్నాయి. సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రైవేట్ ట్రావెల్స్ టిక్కెట్ల రేట్లను యధాఫలంగా రెండింతలు చేసాయి. సంక్రాంతి రద్దీ దృష్ట్యా హైదరాబాద్, బెంగుళూరుల నుండి నెల్లూరుకు నెల్లూరు ఆర్టీసీ వాళ్లు భారీగానే స్పెషల్ బస్సులు నడుపుతున్నారు.




డా॥ బెజవాడ గోపాల్‌రెడ్డి మహిళా డిగ్రీ కళాశాల
(స్థాపితము : 1997)
విక్రమ సింహపురి యూనివర్శిటీకి అనుబంధం, కస్తూరిదేవి విద్యాలయ ప్రాంగణము,
దర్గామిట్ట, నెల్లూరు - 524 003. ఫోన్ : 0861 - 2326461,
సెల్ : 9052171442, 9704646196

మా ప్రత్యేకతలు :
నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు

* కేవలం మహిళల కోసమే స్థాపించబడి గత 19 సంవత్సరాలుగా అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్న ఏకైక విద్యాసంస్థ.
* గత విద్యా సంవత్సరం యూనివర్శిటీ నిర్వహించిన పరీక్షలలో నెల్లూరు జిల్లాలోనే ఉత్తీర్ణతా శాతంలో ద్వితీయ స్థానం సాధించిన ఏకైక విద్యా సంస్థ.
* ఆహ్లాదకరమైన వాతావరణంలో మహిళలకు పూర్తి భద్రత కల్పిస్తున్న విద్యాసంస్థ.
* లాభాపేక్ష లేకుండా విలువలతో కూడిన విద్యనందిస్తున్న సేవా సంస్థ.
* ఉత్తమ అధ్యాపకులచే అత్యుత్తమ శిక్షణ
* సాహిత్య, సాంస్కృతిక, క్రీడారంగాలలో ప్రోత్సాహం
* క్యాంపస్ సెలక్షన్స్ కొరకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ

అందుబాటులోని కోర్సులు : బిఎస్‌సి., బి.కాం

* బి.కాం - కంప్యూటర్ అప్లికేషన్స్
* బి.ఎస్‌సి : మాథ్‌మాటిక్స్ - స్టాటిస్టిక్స్ - కంప్యూటర్ సైన్స్
* బి.ఎస్‌సి : బయో - టెక్నాలజీ - కెమిస్ట్రీ - కంప్యూటర్ అప్లికేషన్స్
* బి.ఎస్‌సి : బయో - టెక్నాలజీ - జువాలజీ - కెమిస్ట్రీ
* బి.ఎస్‌సి : మైక్రోబయాలజీ - బయో - కెమిస్ట్రీ - కెమిస్ట్రీ
* బి.ఎస్‌సి : మైక్రోబయాలజీ - జువాలజీ - కెమిస్ట్రీ

వి.మృదుల M.Sc., - ప్రిన్సిపాల్.
జె.వి.రెడ్డి - సెక్రటరీ & కరస్పాండెంట్.

● పెద్దనోట్ల రద్దు ప్రభావం

# ధరలు తగ్గినా... పెరగని వ్యాపారం



పెద్దనోట్ల రద్దు ప్రభావంతో ఈ సంక్రాంతి పండుగ కళ తప్పింది. అన్నిరకాల వ్యాపారాలు బాగా తగ్గిపోయాయి. పండుగ ముందు రోజుల్లో కళకళలాడుతుండాల్సిన వ్యాపార దుకాణాలు వెలవెలబోతున్నాయి. పండుగ వ్యాపారాలపై వ్యాపారస్థులు భారీ అంచనాలు పెట్టుకుని వుంటారు. ఈసారి అంచనాలకు తగ్గట్లుగా వ్యాపారాలు లేవు. 50శాతం వ్యాపారాలు పడిపోయాయి. మార్కెట్‌లోకి పూర్తి స్థాయిలో నగదు రాలేదు. నగదు విత్‌డ్రాపై బ్యాంకుల్లో నిబంధనలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా డిజిటల్ కరెన్సీ వున్న మాల్స్, కార్పొరేట్ సంస్థల్లో కొంత వరకు వ్యాపారం జరుగుతోంది. కేవలం నగదుతోనే వ్యాపారాలు చేసే స్టోన్‌హౌస్‌పేట, పప్పులవీధి, సంతపేటల్లోని వ్యాపార సంస్థల్లో వ్యాపారాలు తగ్గాయి. ముఖ్యంగా గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది నిత్యావసర వస్తువుల ధరలు తగ్గినప్పటికీ వ్యాపారాలు పెరగకపోవడం నోట్ల రద్దు ఎఫెక్ట్‌తోనే!

# శుభమస్తులో మస్తుగా ఆఫర్లు



నెల్లూరు, వీఆర్‌సి సెంటర్‌లోని శుభమస్తు షాపింగ్‌మాల్ వారు 'లక్షణంగా పండుగలు – లక్కీ కార్డు' పేరుతో నిర్వహిస్తున్న బహుమతుల మేళాలో భాగంగా 9వ తేదీ నాల్గవ నానోకారు లాటరీని నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై లక్కీడిప్ తీసారు. ఈ డ్రాలో కె.శివ అనే వ్యక్తి నానోకారు గెలుచుకున్నారు. రోజుకో పట్టుచీర విజేతను 20వ డివిజన్ కార్పొరేటర్ దాసరి రాజేష్ లాటరీ తీసి ప్రకటించారు. ఎం.భారతి అనే మహిళ పట్టుచీరను గెలుచుకున్నారు. ఈ సందర్భంగా శుభమస్తు అధినేతలు బయ్యా శ్రీనివాసులు, బయ్యా రవిలు మాట్లాడుతూ తమ మాల్‌లో ప్రవేశపెట్టిన ఆఫర్లకు ఖాతాదారులు, మహిళల నుండి విశేషస్పందన లభిస్తోందని చెప్పారు.

## కాంగ్రెస్ నేత ఆధ్వర్యంలో బీజేపీ నేత జన్మదినం



నేదురుమల్లి ఫౌండేషన్ ఛైర్మన్, బీజేపీ నాయకులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా ఈ నెల 8న జిల్లా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి, సాల్వేషన్ ఆర్మీ చర్చి కార్యదర్శి, ఇందిరాభావన్ ఇన్‌ఛార్జి టి.బాలసుధాకర్ ఆధ్వర్యంలో పేద మహిళలకు వస్త్రదానం చేశారు. తొలుత, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కుటుంబం సుఖసంతోషాలతో వుండాలని కోరుకుంటూ సాల్వేషన్ ఆర్మీ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో టి.మేరీగ్రేస్, టి.విజయప్రసాద్, దయా సుస్మిత, షైనీ, జి.ప్రతాప్, పండు, సుప్రియ, సుమప్రియ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛభారత్ చేపట్టిన మయూర్



నెల్లూరు నగరంలోని 12వ డివిజన్‌లో కార్పొరేటర్ ఆనం రంగ మయూర్‌రెడ్డి ఈ నెల 7వ తేదీ స్వచ్ఛభారత్ నిర్వహించారు. రాజుపాలెం రామాలయం వీధిలో రోడ్లను చిమ్మి, రహదారికి ఇరువైపులా వున్న పిచ్చిమొక్కల్ని తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజుపాళెం గ్రామాన్ని దత్తత తీసుకున్నానని ప్రకటించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. స్థానిక నేతలు శ్రీనివాసులు, అబ్రహాం, చంటి, భాస్కర్, యలమందరావు పాల్గొన్నారు.

## బ్లాక్‌లో అమ్మితే చర్యలు

చిరంజీవి నటించిన ఖైదీ నెంబర్. 150 సినిమాకు సంబంధించిన టిక్కెట్లను ఎవరైనా బ్లాక్‌లో విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్2 థియేటర్ మేనేజర్ లీలామోహన్ పేర్కొన్నారు. ఆదివారం థియేటర్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఎస్2, అర్చన, లీలామహల్‌లో సినిమా ప్రదర్శితం అవుతుందని, ప్రేక్షకుల అభిమానాన్ని అడ్డం పెట్టుకుని ఎవరైనా బ్లాక్‌లో విక్రయాలు జరిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అడ్వాన్స్ బుకింగ్‌లో సమస్యలు తలెత్తితే 044 42244224 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. అర్చన మేనేజర్ వీరేంద్ర పాల్గొన్నారు.

## వైసీపీ యువజన విభాగంలో ప్రదీప్‌రెడ్డి

నెల్లూరుజిల్లా సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన కోడూరు ప్రదీప్‌రెడ్డి వైయస్సార్సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయన్ను నియమించినట్లు పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.


# సింహపురీయుల్ని ఆకట్టుకున్న ఇంటర్నేషనల్ ఎక్స్‌పో



అమ్మ ఫర్నిచర్ మాల్ ఆధ్వర్యంలో నెల్లూరు మినీబైపాస్‌రోడ్డులోని జీపీఆర్ కళ్యాణ మండపంలో ఈ నెల 5 నుంచి ప్రారంభమై 9వ తేదీ వరకు నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫర్నీచర్ ఎక్స్‌పో- 2017 సింహపురీయుల్ని విశేషంగా ఆకట్టుకుంది. ఎక్స్‌పో ముగింపు సందర్భంగా విద్యార్థులకు ఫర్నీచర్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. పలు పాఠశాలల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో ఉంచిన వివిధ దేశాలకు చెందిన అత్యాధునిక ఫర్నీచర్‌ను తక్కువ ధరలకు అందించామని ఫర్నీచర్ మాల్ అధినేత గడ్డం సుధాకర్‌రెడ్డి తెలిపారు. వివిధ మోడల్స్ ఫర్నీచర్‌పై 25శాతం డిస్కౌంట్ ఇచ్చామని ప్రతి కొనుగోలుపై లక్కీడిప్‌లో టివిఎస్ జ్యూపిటర్ స్కూటర్‌ను బహుమతిగా అందజేయనున్నట్లు తెలిపారు. అమ్మ ఫర్నిచర్ అధినేతలు గడ్డం సుమన్‌రెడ్డి, గడ్డం సుజన్‌రెడ్డి పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## జన్మభూమిలో సీఎం



రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 10వ తేదీన గూడూరు మండలంలోని చెన్నూరులో జరిగిన 'జన్మభూమి – మా ఊరు' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో చంద్రబాబు ఎక్కడకు వెళ్ళినా విమానం, హెలికాప్టర్ ప్రయాణం కంపల్సరీగా వుంటుంది. చెన్నైకు విమానంలో వచ్చిన ఆయన అక్కడనుండి హెలికాప్టర్‌లో చెన్నూరుకు చేరుకున్నారు. కార్యక్రమం ముగిసాక హెలికాప్టర్‌లో రేణిగుంట ఎయిర్‌పోర్టుకు వెళ్లారు. అక్కడ నుండి ఫ్లైట్‌లో విజయవాడకు చేరుకున్నారు. ఇంతకుముందు వై.యస్ గాని, చంద్రబాబు గాని హైదరాబాద్ నుండే రాష్ట్రంలో ఏ ప్రాంతానికైనా నేరుగా హెలికాప్టర్‌లోనే వెళ్లేవారు. వై.యస్. హెలికాప్టర్ ప్రమాదం తర్వాత చంద్రబాబు ఎక్కువ దూరం హెలికాప్టర్‌లో ప్రయాణం చేయడం లేదు. ఈ 13జిల్లాల పర్యటనల కోసం ఆయన విమానం, హెలికాప్టర్ రెండింటిని మిక్స్ చేసి వాడేస్తున్నాడు.

## సినిమాల సందడి



సంక్రాంతి నేపథ్యంలో ఒకే సారి ఇద్దరు మెగా హీరోలు నటించిన సినిమాలు విడుదల కావడంతో నగరంలోని థియేటర్ల వద్ద అభిమానుల పండుగ వాతావరణం నెలకొంది. మెగాస్టార్ చిరంజీవి నటించిన సినిమా 9ఏళ్ల తర్వాత విడుదలైంది. ఎస్2తో పాటు అర్చన, లీలామహల్‌లలో ఖైదీ నెం.150ని విడుదల చేశారు. 11వ తేదీ సినిమా విడుదల కాగా అభిమానుల ఒత్తిడితో థియేటర్ యాజమాన్యం మొదటిరోజు ఆటల టిక్కెట్లను అభిమానులకే ఇవ్వాల్సి వచ్చింది.

12వ తేదీ మరో పెద్దహీరో యువరత్న బాలకృష్ణ నటించిన 'గౌతమిపుత్ర శాతకర్ణి' నర్తకి, సిరి కాంప్లెక్స్‌లలో విడుదలైంది. ఈ రెండు సినిమాలు ఆడే థియేటర్ల వద్ద అభిమానులు తమ హీరోల ఫ్లెక్సీలతో దడులు కట్టేసారు.

## వీఆర్‌సి వాకర్స్ అధ్యక్షుడిగా మళ్లీ పందిళ్లపల్లి



నెల్లూరులోని వీఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడుగా 2017వ సంవత్సరానికి కూడా ప్రస్తుత అధ్యక్షుడు పందిళ్లపల్లి పట్టాభి రామిరెడ్డినే ఎన్నుకున్నారు. ఈ నెల 9వ తేదీన నేతాజీ (ఎంఎస్‌ఆర్) ఫైలట్ హైస్కూల్‌లో వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరుగగా పట్టాభిరామిరెడ్డినే మళ్ళీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఈ ఏడాది పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే కొత్త కార్యవర్గానికి గౌరవాధ్యక్షులుగా సి.భాస్కర్‌రావు, డాక్టర్ ఎ.పెంచలయ్య, ఎం.వెంకటాద్రిరెడ్డి, వేములప్రసాదరావు, కార్యదర్శిగా వి.నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా వి.వేణుగోపాల్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, కోశాధికారిగా తులసి వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక కార్యదర్శిగా జె.వెంకటేశ్వర్‌రావు, జాలీవాకర్‌గా జూటూరు వెంకటేశ్వర్లు, ఆఫీస్ ఇన్‌ఛార్జ్‌గా పి.రాఘవేంద్రరావులను ఎన్నుకున్నారు.

## బాధితులను ఆదుకోవాలి



నెల్లూరు, పొర్లుకట్ట వద్ద బాణాసంచా గోడౌన్ ప్రమాదంలో మృతి చెందిన గిరిజన కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ జిల్లా కాంగ్రెస్ నాయకులు 7వ తేదీ జిల్లా జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఒక్కో కుటుంబానికి 15లక్షల నష్టపరిహారం అందించాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి ఓ పక్కా ఇల్లు, ఇంటికో ఉద్యోగం, పిల్లలకు ఉచిత కార్పొరేట్ చదువులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, కాంగ్రెస్ నెల్లూరు నగర అధ్యక్షులు ఉడతా వెంకట్రావ్, పీసీసీ అధికార ప్రతినిధి రఘురామ్ ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు సాయిగోపాల్, నారాయణరావు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



# చేనేత కళాకారులను ప్రోత్సహించండి

**- మున్సిపల్ మంత్రి నారాయణ**

నెల్లూరు, సర్వోదయ కళాశాలలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి ఖాదీ, హస్త కళల ప్రదర్శన, అమ్మకాలను ఈ నెల 7వ తేదీన మున్సిపల్ మంత్రి నారాయణ ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ఒక్క జత యినా ఖాదీ గుడ్డలను కొని చేనేత కళా కారులను ప్రోత్సహించాలని ఈ సంద ర్భంగా మంత్రి పేర్కొన్నారు. ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే భారతీయులకు ప్రత్యేక గుర్తింపు తెచ్చింది ఖాదీ వస్త్రాలేనన్నారు.

ఈ కార్యక్రమంలో నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఖాదీ బోర్డు దక్షిణ ప్రాంత అధ్యక్షుడు చక్రపాణి, తెలుగుదేశం నాయకులు వేనాటి రామ చంద్రారెడ్డి, బీజేపీ నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, వి.సురేఖరెడ్డి, దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, కార్పొరేటర్లు నూనె మల్లి ఖార్జునయాదవ్, రాజానాయుడు, మహిళా కార్పొరేషన్ డైరెక్టర్ మల్లి నిర్మల తది తరులు పాల్గొన్నారు.

# ఈస్ట్‌కోస్ట్‌లో కృష్ణపట్నం బెస్ట్

**- కస్టమ్స్ కమిషనర్ ఎస్‌కె రహమాన్**



సాగరమాలలో కృష్ణపట్నం పోర్టు ఒక ఆణిముత్యంగా వెలుగొందనుందని కస్టమ్స్ కమిషనర్ ఎస్‌కె రహమాన్ అన్నారు. కృష్ణపట్నం పోర్టు కస్టమ్స్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటుచేసిన బ్యాగేజ్ స్కానర్‌ను ఆయన సోమవారం పోర్ట్ సిఇఓ అనిల్ ఎండ్లూరితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ రహమాన్ మాట్లాడుతూ, భద్రతా చర్యల్లో భాగంగా పోర్ట్‌లో కోటి రూపాయలు ఖరీదు చేసే బ్యాగేజ్ స్కానర్‌తో పాటు, మెటల్ డిటె క్టర్లను ఏర్పాటు చేశామన్నారు. కస్టమ్స్ అధికారులకు కృష్ణపట్నం పోర్ట్ సహకారం మరువలేనిదన్నారు. పోర్ట్‌లో 24 గంటలూ కస్టమ్స్ అధికారులు పనిచేస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో సిబ్బందిని కూడా పెంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో కృష్ణపట్నం పోర్ట్ కంటైనర్ టెర్మి నల్‌లోనూ స్కానర్‌ను ఏర్పాటుచేయ నున్నామని, దీంతో త్వరిత గతిన కంటైనర్ల డైరెక్ట్ డెలివరీకి అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. గత ఏడాదిన 1650 కోట్ల కస్టమ్స్ రెవిన్యూ రాగా, ఈ ఏడాది లక్ష్యం రెండువేల కోట్లని అన్నారు. కృష్ణపట్నం పోర్ట్ సిఇఓ అనిల్ ఎండ్లూరి మాట్లాడుతూ, ఈ పోర్టు భవిష్యత్తులో అతిపెద్ద పోర్ట్‌గా రూపుదిద్దుకుంటుందని, సింగపూర్, కొలొంబో అభివృద్ధికి పోర్ట్‌లే కీలకమని, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో కృష్ణపట్నం పోర్ట్ కీలకపాత్ర పోషించ నుందన్నారు. రాష్ట్రంలో కోస్టల్ ఎంప్లాయి మెంట్ జోన్ ఏర్పాటుతో మరింత అభివృద్ధి పథంలో పయనిస్తుందని, కొద్ది కాలంలోనే కంటైనర్ కార్గో పెంచుకోవడం జరిగిందని, రానున్న రోజుల్లో 2.30లక్షల టన్నులు కంటైనర్ కార్గో రవాణా లక్ష్యమన్నారు. భద్రతతో పాటు త్వరితగతిన కార్గో డెలి వరీని కృష్ణపట్నం పోర్ట్ నిర్వహిస్తుం దన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రామమోహన్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ కె.రామారావు, పోర్ట్ సిఇఓ జితేంద్ర, పోర్ట్ కస్టమ్స్ అధికారి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# సొంత జిల్లాలో ఏం వెలగబెట్టావ్!

**- మంత్రిపై అనిల్ నిప్పులు**

సొంత జిల్లాలోని నెల్లూరు కార్పొరేషన్‌కు రెండు నెలలుగా కమిషనర్‌ను నియమించుకోలేని మున్సిపల్ మంత్రి నారాయణకు అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత లేదని నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ ధ్వజమెత్తారు. 7వ తేదీ నెల్లూరులోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం పెట్టి యధావిధిగా తన శైలిలో, తనదైన బాణిలో నారాయణను ఏకిపెట్టాడు. ప్రతి పక్షాలు అభివృద్ధిని అడ్డుకుంటున్నాయని మంత్రి పదేపదే అంటున్నాడు. ఆయన ఏం అభివృద్ధిని వెలగబెడితే మేం అడ్డు కున్నామో చెప్పాలని నిలదీసాడు. బాణాసంచా గోడౌన్ పేలుడుకు బాధ్యులైన కార్పొరేషన్ అధికారులపై ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించాడు. నెల్లూరు భూగర్భడ్రైనేజీ, తాగునీళ్లకు 1100కోట్లు తెస్తామని మంత్రి అంటున్నారు. కాని అవి గ్రాంటు కాదు, అప్పుకింద తెచ్చామన్న విషయాన్ని మంత్రి ఎందుకు దాస్తున్నారని అడిగాడు. నగరాభివృద్ధిపై బహిరంగ



చర్చకు సిద్ధమని, ఎప్పుడు ఎక్కడకు రమ్మంటే అక్కడకు వస్తామని ఆయన సవాల్ విసిరాడు. ఈ సమావేశంలో డిప్యూటిమేయర్ యం.ద్వారకానాథ్, కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, ఖలీల్ అహ్మద్, నాగరాజు, రాజశేఖర్, అశోక్‌లు పాల్గొన్నారు.




స్వర్గీయ సోమిరెడ్డి హైమావతమ్మ గారు

W/o. కీ॥శే॥ సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

జననం: 1938 మరణం: 15-01-2014

## మాతృదేవోభవ

ఆప్యాయతానురాగాలు పంచిన అమృతమూర్తి

మా ఇంటి ఆరాధ్యదైవం, మా తల్లిగారైన

**శ్రీమతి సోమిరెడ్డి హైమావతమ్మ గారు**

మమ్ము వీడి దైవసన్నిధికి చేరి మూడేళ్ళు గడవనున్న సందర్భంగా

ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

కన్నీటి నివాళులతో...

కుమారుడు - కోడలు: **సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి - జ్యోతి**

శాసనమండలిసభ్యులు

కుమార్తెలు - అల్లుళ్ళు

కట్టంరెడ్డి రాణీసంయుక్త - రాధాకృష్ణారెడ్డి

కేతిరెడ్డి ఉషారాణి - రామకోటారెడ్డి

| మనుమలు | - | మనుమరాండ్రు |
|---|---|---|
| సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి | - | శ్రుతి |
| డా॥ సోమిరెడ్డి అర్జున్‌రెడ్డి | - | లక్ష్మీఐషిత |
| నిమ్మ కౌశిక్‌రెడ్డి | - | డా॥ సింధు |
| సన్నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి | - | నీలిమ |
| యల్లా సనత్‌రెడ్డి | - | షాలిని |
| డా॥ కేతిరెడ్డి కళాధర్‌రెడ్డి | - | డా॥ మాలిని |
| కేతిరెడ్డి శశధర్‌రెడ్డి | - | కీర్తి |
| కట్టంరెడ్డి విక్రమ్‌రెడ్డి | - | స్నిగ్ధ |

| మునిమనుమలు | మునిమనుమరాండ్రు |
|---|---|
| యల్లా శర్విన్ | యల్లా సంజన |
| కేతిరెడ్డి శ్రీమన్ | సోమిరెడ్డి శివాని |
| నిమ్మ ధీర్ | కేతిరెడ్డి శ్రితిక |
| కేతిరెడ్డి శ్రీవంత్ | కట్టంరెడ్డి శ్రీశాన్వి |
| | సన్నారెడ్డి నిరుక్తలేఖ |
| | సన్నారెడ్డి రాయల్ భార్గవ్ |



# వాకర్స్ సేవలు ఆదర్శనీయం

## ఎంపి మేకపాటి

రాష్ట్రంలో ఏ ప్రాంతంలో లేనివిధంగా నెల్లూరులోని ఏ.సి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ వారు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. ఈనెల 8న ఉదయం ఏసి స్టేడియంలో వాకర్స్ అసోసియేషన్ వారు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపి మేకపాటి మాట్లాడుతూ వాకర్స్‌వారి సేవలు ప్రశంసనీయమన్నారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, వాకర్స్ అసోసియేషన్ వారు నిర్వహించే ఆరోగ్య కార్యక్రమాలు, ఆరోగ్య పరీక్షలు, సామాజిక సేవా కార్యక్రమాలు ప్రతి సేవాసంస్థకు మార్గదర్శకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ గవర్నర్ మైథిలి మనోహర్‌రెడ్డి, డాక్టర్ అంకిరెడ్డి, వేలూరు రంగరావు, స్వర్ణా రమేష్‌బాబు, రవిచంద్ర, డాక్టర్ ఎంఎస్ రెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, బెజవాడ సుందర రామిరెడ్డి, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ దొరస్వామి నాయుడు, బాషా, షణ్ముకరామ్, ఎన్ఎల్‌వి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


# అందరికీ ఆరోగ్యమే సీఎం ఆశయం



రాష్ట్రంలో అందరికీ ఆరోగ్యం అందించాలన్న ఆశయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ దయాకర్ పేర్కొన్నారు. 7వ తేదీ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని తన ఛాంబర్‌లో ఆరోగ్యరక్ష, అందరికీ ఆరోగ్యం, చంద్రన్న ఆశయం కరపత్రాలను, పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా దారిద్ర్యరేఖకు దిగువున వున్నవారికి, ఉద్యోగ ఆరోగ్య రక్షణకు, పాత్రికేయులకు ఉచిత వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం గుర్తించిన ప్రభుత్వ వైద్యశాలల ద్వారా అందిస్తున్న ఎన్టీఆర్ వైద్యసేవలను జనవరి నెల నుంచి 32లక్షల నిరుపేద కుటుంబాలకు ఎలాంటి కార్డులు లేకపోయినా కూడా వైద్యచికిత్స అందిస్తామన్నారు. ఈ పథకంలో చేరేందుకు ఫిబ్రవరి 8వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సంవత్సరానికి రూ.1200లు ప్రీమియం చెల్లిస్తే రూ.2లక్షలు విలువైన చికిత్సలు ఉచితంగా అందజేస్తామన్నారు. బి.పి., షుగర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులకు కూడా ఈ పథకంలో ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. ఈ ప్రీమియం చెల్లించేందుకు మీ సేవ కేంద్రాలను సంప్రదించాలన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ అధికారులు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో...

# త్యాగరాజస్వామి గ్రామోత్సవం



నెల్లూరు వేదాయపాలెం త్యాగరాజస్వామి మందిరంలో ఆదివారం ముక్కోటి ఏకాదశి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామునే సర్వాలంకారుడైన స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. సహస్రనామ పూజలు అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. భాస్కర మురళీశర్మ, చక్రాల రఘు, రాంశర్మ ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. ఉభయకర్తలుగా వారణాసి, వంజాలి కుటుంబీకులు వ్యవహరించారు.

# లక్ష్యాన్ని అలక్ష్యం చేయొద్దు

## రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి యనమల





ఆదిశంకర ఇంజనీరింగ్ కాలేజీలో నూతనంగా నిర్మించిన కళాశాల భవనాలను మరియు కెవిటి కన్వెన్షన్ సెంటర్‌ను ప్రారంభించిన ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు, పక్కన మునిసిపల్ మంత్రి నారాయణ, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఎమ్మెల్సీలు బీదా రవిచంద్ర, వాకాటి నారాయణరెడ్డి

కళాశాల విద్య కీలకమని, విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాలను అందుకునే వరకు కష్టపడాలని రాష్ట్ర ఆర్థికశాఖా మంత్రి యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. ఈ నెల 7వ తేదీ నెల్లూరుజిల్లా గూడూరు వద్ద గల ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో నూతనంగా నిర్మించిన అకడమిక్ బ్లాక్, కేవీటి కన్వెన్షన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిఏటా ఫీజు రియంబర్స్‌మెంట్ కోసం రూ.2వేల కోట్ల నుంచి రూ.30వేల కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలలు సమీపంలోని పరిశ్రమలతో అసోసియేట్ కావాలన్నారు. అప్పుడే అన్ని విధాలా అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, ఎమ్మెల్సీలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, కళాశాల ఛైర్మన్ వంకి పెంచలయ్య తదితరులు మాట్లాడారు. తిరుపతి ఎంపి వరప్రసాదరావు, టూరిజం ఛైర్మన్ జయరామిరెడ్డి, ఏపిఐఐసి ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ పి.కృష్ణయ్య, మాజీ ఎమ్మెల్యేలు పరసా రత్నం, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పెంచలకోన ఆలయ ఛైర్మన్ నానాజీ పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# వైజేపి లయన్స్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

గూడూరులోని వైజెపి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 8న పట్టణంలోని సిరామిక్ కళాశాల రోడ్డులోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. పెద్దసంఖ్యలో మహిళలు ఈ పోటీలో పాల్గొని ముచ్చటైన సంక్రాంతి ముగ్గులతో అందరినీ అలరించారు. ఈ కార్యక్రమానికి మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ కోడూరు కల్పలత, నాయకులు కోడూరు మీరారెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. మన సంస్కృతి సంప్రదాయాలకు రంగవల్లులు ప్రతీకలని, మన సంప్రదాయాలను, ఆచారాలను మనం పరిరక్షించుకోవాలని వారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వైజేపి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, కార్యదర్శి హరికృష్ణ, మంజులమ్మ, కోడూరు మీరా రెడ్డి, సుబ్రహ్మణ్యంరాజు తదితరులతో పాటు సిరామిక్ యూత్ ప్రతినిధులు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు ఇస్తున్న వైజేపి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, కోడూరు కల్పలత, మీరారెడ్డి తదితరులు.

## నిస్సహాయులకు

# ఇన్నర్‌వీల్ దుస్తులు

గూడూరు పట్టణంలోని సాయిబాబా మందిరంలో ఈ నెల 8న స్థానిక ఇన్నర్‌వీల్ క్లబ్, ఆంధ్ర మహిళా మండలి ఆధ్వర్యంలో ఒక మంచి సేవా కార్యక్రమం నిర్వహించారు. నిరుపేదలు, అసహాయులు.. అయిన పలువురు మతిస్థిమితం లేని నిస్సహాయులకు నూతన దుస్తులను అందజేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సేవా కార్యక్రమంలో ఆంధ్ర మహిళామండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు వై.స్నేహలతారెడ్డితో పాటు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో భాగంగా గూడూరు మండలం చవటపాళెం జడ్పీ హైస్కూల్‌లో నిర్మించిన కళావేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ప్రక్కన స్కూల్ హెడ్‌మాస్టర్ పురంధర్‌రాజు, నాగరాజు తదితరులు



గూడూరు, 14వ వార్డులో చంద్రన్న బీమా పథకం కింద రూ.39వేలను బెజవాడ వెంకట్రావ్ కుమారుడు బెజవాడ సంతోష్, వారి కుటుంబసభ్యులకు అందజేసిన మునిసిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, వైస్ ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్ తదితరులు

# బ్యాంకుల వద్ద వైకుంఠ దర్శనం

గల్పిక

అది కర్నూలు జిల్లా కనగనపల్లె. మచ్చుమర్రి ప్రాజెక్ట్‌కు ప్రారంభోత్సవం చేసిన హైటెక్‌రత్న, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతున్నాడు... తమ్ముళ్లు, మీరంతా నా పట్ల కృతజ్ఞత చూపాలి, ఆ కృతజ్ఞత కూడా ఓట్ల రూపంలో వుండాలి, తమ్ముళ్లు మీకు కావాల్సినవన్నీ నేను ఇస్తున్నాను, పప్పిస్తున్నాను, నిప్పిస్తున్నాను, వీటిని వాడుకోవడానికి అప్పిస్తున్నాను. కాళ్లకు వేసుకోవడానికి చెప్పిస్తున్నాను, రైతులకు నీరిస్తున్నాను, మందుబాబులకు బీరిస్తున్నాను, ప్రతి ఒక్కరికీ సంక్రాంతి కానుక ఇచ్చాను, ప్రతి ఇంట్లో వేడుక తెచ్చాను. ఉండడానికి ఇళ్లిచ్చాను, తాగడానికి నీళ్లిచ్చాను, రాజధానికి సింగపూర్ తెచ్చాను, రాష్ట్రాన్నే సింగూర్‌గా మార్చాను... ఇవన్నీ నేనే తెచ్చాను, ఇవన్నీ నేనే ఇచ్చాను తమ్ముళ్లు... కాబట్టి నా పట్ల మీరు కృతజ్ఞులై వుండాలి. కాబట్టి ఒక్కసారి బలంగా చప్పట్లు తట్టి మీ ఆమోదం తెలపండి అని కోరాడు. వెంటనే సభలో ఓ నలుగురు సంక్రాంతి పండుగ అరిశెలు తట్టినట్లుగా, నెల్లూరు కార్పొరేషన్ ముదురుదోమలను చంపినట్లుగా చాలా నీరసంగా చప్పట్లు కొట్టారు. ఆ చప్పట్లలో వూపు లేక చంద్రబాబు నిరుత్సాహపడ్డాడు. అప్పుడు నందికొట్కూరు వైకాపా ఎమ్మెల్యే ఐజయ్య లేచి చంద్రబాబును ఉద్దేశించి, సార్, మీకు బలంగా చప్పట్లు కొట్టించాలా అని అడిగాడు. అవును అన్నట్లు చంద్రబాబు తలూపాడు. వెంటనే ఐజయ్య మైక్ తీసుకుని... ఎవరి పేరు చెబితే మోడుబారిన పూలు వికసిస్తాయో, ఎవరి పేరు చెబితే ఆందోళన నిండిన కళ్లల్లో ఆనందం కనిపిస్తుందో, ఎవరి పేరు వింటే బీడు పడ్డ పొలాలు పంటచేలవుతాయో, ఎవరి పేరు చదివితే మేఘాలు ఆఘమేఘాల మీద పరుగెత్తుకొచ్చి వర్షిస్తాయో, ఎవరి పేరు చెబితే ప్రతి ఇంట్లో ఉచిత విద్యుత్ వెలుగులు ప్రకాశిస్తాయో... అతడే వై.యస్.రాజశేఖరరెడ్డి... అని డైలాగ్ పూర్తి చేశాడు. అంతే సభ మొత్తం చప్పట్లతో హోరెత్తిపోయింది. ఈ పరిణామం చంద్రబాబుకు గాయం మీద యాసిడ్ పోసినట్లుగా అయ్యింది. వెంటనే ఆయన ఐజయ్య వద్ద మైకు లాక్కుని ఈ సభ ఇంతటితో సమాప్తం అని చెప్పి రుసరుసలాడుతూ దిగేసాడు.

★★★★★

"నేను లోకల్ లోకల్ పక్కా లోకల్ ఇది పక్కా లోకల్" అన్న పాట రింగ్ టోన్‌తో తన సెల్‌ఫోన్ మోగుతుండడంతో నిద్రలో వున్న స్టైల్ ఆఫ్ సింహపురి, మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి(66) కళ్లు తెరిచాడు. చిమ్మచీకటిగా వుంది. ఇంత అర్ధరాత్రివేళ నాకు ఫోన్ చేసిన తలమాసినోడు ఎవరా అనుకుంటూ ఫోన్ ఆన్‌చేసాడు. అవతల సీఎం క్యాంప్ కార్యాలయం నుండి ఫోన్, సార్ మిమ్మల్ని అర్జంట్‌గా బయలుదేరి రమ్మంటున్నారని సీఎం పిఏ చెప్పాడు. ఉదయాన్నే బయలుదేరుతానని చెప్పు అని వివేకా అన్నాడు. అవతల నుండి పి.ఏ... ఇప్పుడు దీనిని ఉదయమే అని అంటారు, టైం ఏడుగంటలైందన్నాడు. మరి ఇంత చీకటిగా ఉందేంటనుకుంటూ వివేకా చేతితో ముఖాన్ని తడుముకున్నాడు. అప్పుడు ఆయనకు విషయం అర్ధమైంది. రాత్రి పడుకునే ముందు కళ్లకు పెట్టివున్న నల్లద్దాలు తీయడం మరచిపోయానని, వెంటనే వివేకా ఫోన్ కట్‌చేసి బాత్రూంలోకి పోయాడు.

★★★★★

వెలగపూడిలోని సీఎం క్యాంపు కార్యాలయం. వివేకా అప్పుడే లోపలకు అడుగుపెట్టాడు. చంద్రబాబుతో పాటు అక్కడున్న మంత్రులు నారాయణ, దేవినేని ఉమ, పత్తిపాటి పుల్లారావు, శిద్ధా రాఘవరావు, రావెళ్ల కిషోర్‌బాబులు కూడా విచారంగా ముఖం పెట్టి వున్నారు. వారిని చూసి వివేకా... పెద్దనోట్ల రద్దుతో మీ బ్లాక్‌మనీ అంతా బ్లాకైపోయినట్లుగా అలా ఫేసులు పెట్టి ఉన్నారేంటని అడిగాడు. అందకు నారాయణ... బ్లాక్‌మనీ సమస్య కాదు వివేకా, అలాంటివి నేనే పరిష్కరించగలను, కాని సార్ సమస్య ఏందంటే... ఆయన ఎన్ని పనులు చేసినా ప్రజలు గుర్తుపెట్టుకోవడం లేదు. ఎక్కడ సభకు వెళ్లినా స్టేజీషోలలో ప్రేక్షకులను యాంకర్లు ఎంకరేజ్ చేసి చప్పట్లు కొట్టించుకున్నట్లుగా చంద్రబాబు గారే ప్రజలకు తాను చేసిన పనులన్నింటినీ చెప్పి అడిగిమరీ చప్పట్లు కొట్టించుకోవాల్సి వస్తోంది. సార్, అడిగినా చప్పట్లు కొట్టని జనం, వై.యస్. లేకున్నా ఆయన పేరు వినగానే చప్పట్లు కొడుతున్నారు. మన సార్‌ను ప్రజలు ప్రతిక్షణం గుర్తు పెట్టుకోవాలి. దానికేదన్నా కంత్రీ ప్లాన్ ఉంటే చెప్పు అని కోరాడు. అంతా విన్న వివేకా ఓస్... ఇంతేనా, ఇలాంటివి ఎన్ని చూళ్లేదు... రేపు ముక్కోటిరోజుకు చూడండి... సీన్ మారిపోతుంది, ప్రతిఒక్కరి గుండెలపై చంద్రబాబు ఉంటాడు అని భరోసా ఇచ్చాడు. ఆ మాట వినడంతో చంద్రబాబుకు లీటర్ పాలలో అరకిలో బూస్ట్ కలుపుకుని తాగినంత ఎనర్జీ వచ్చింది.

★★★★★

జనవరి 8వ తేదీ, ముక్కోటి పర్వదినం. విజయవాడలోని సీఎం నివాసంలో చంద్రబాబు, మంత్రులతో పాటు వివేకా కూడా ఉన్నాడు. టీవీ ఆన్ చేసి 9-9-99-999 న్యూస్ ఛానెల్ పెట్టారు. న్యూస్ వస్తున్నాయి. న్యూస్ యాంకర్ సగం, ముక్కోటి దృశ్యాలు ఇంకో సగం స్క్రీన్‌పై వస్తున్నాయి. కాని ఆ దృశ్యాలలో ఎక్కడా దేవాలయాలు కనిపించడం లేదు. బ్యాంకులు, ఏటిఎం కౌంటర్‌లు కనిపిస్తున్నాయి. క్యూలలో వున్న భక్తులకు కొందరు పసుపు నామాలు పెడుతున్నారు. భక్తులు బ్యాంకులోకి పోగానే అక్కడ నిలువెత్తు చంద్రబాబు కటౌట్ దర్శనం... ఆ తర్వాత వారికి బ్యాంకు సిబ్బంది కొత్త నోట్లు ఇస్తున్నారు. ఆశ్చర్యంగా ఆ నోట్ల మీద గాంధీ తాత బదులు చంద్రబాబు ఫోటో... ఆ దృశ్యంకు సంబంధిస్తూ న్యూస్ యాంకర్ స్వప్నసుందరి వివరాలు అందిస్తూ... మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా ముక్కోటి దర్శన ఏర్పాట్లు జరిగాయి. ప్రజలు నగదు కోసం ఎలాగూ బ్యాంకుల ముందు 'క్యూ'లలో నిలబడాల్సి ఉండడంతో, వారికి దేవాలయాలకు వెళ్లే పని లేకుండా బ్యాంకుల వద్దే వైకుంఠ ద్వారదర్శనం ఏర్పాట్లు చేయించారు. రాష్ట్ర ప్రజలకు అన్నీ ఇచ్చిన దేవుడు చంద్రబాబే కాబట్టి ఆయన కటౌట్‌ను దర్శించుకుని తరించే విధంగా ప్రజలకు అవకాశం కల్పించారు. అంతేకాకుండా వివేకా ప్రత్యేకంగా ప్రధాని నరేంద్రమోడీ, ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్‌పటేల్‌లతో మాట్లాడి ఆంధ్రప్రదేశ్‌కు పంపించే కొత్తనోట్లపై చంద్రబాబు ఫోటోను ముద్రించేలా ఒప్పించారు. ఈరోజు నోట్ల రూపంలో ప్రతిఒక్కరి జేబుల్లో చంద్రబాబు ఉన్నాడు. ప్రతిఒక్కరి గుండెలపై చంద్రబాబు ఉండేలా వివేకా చేసాడు.... అని న్యూస్‌రీడర్ చెప్పుకుంటూ పోతుంది. చంద్రబాబు ఆనందంతో కళ్ల నిండా నీళ్లు... ఈ కోహినూర్ డైమండ్‌ను ఇన్నేళ్లు ఎలా మిస్సయ్యానబ్బా అని మనసులో అనుకుంటూ వివేకావైపు కృతజ్ఞతగా చూడసాగాడు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఉద్యోగులు తమ బాధ్యతలను జాగ్రత్తగా నిర్వహించండి. అనవసర సంఘర్షణలు వద్దు. విలువైన వస్తువులను సమకూర్చుకొంటారు. ఉద్యోగార్ధులకు అవకాశాలు రావడం ప్రారంభమవుతుంది. కోర్టు వ్యవహారాలు అనుకూలం కాగలవు. ఆరోగ్యం జాగ్రత్త. వృత్తి పరమైన ఆటంకాలు తొలగడం వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగడం, ఆదాయవృద్ధి బాగుంటుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఉద్యోగ బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహిస్తారు. క్రయ విక్రయాలు లాభిస్తాయి. వారం ప్రారంభంలో కుటుంబసభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. కోర్టు వ్యవహారాలు బాకీల సమస్యలు కొంతవరకు పరిష్కారం కాగలవు. విద్యా ప్రగతి బాగుంటుంది. ఆదాయం ఆశించినంత ఉండదు. ఆలోచనలు ఎక్కువగా ఉండి ఆచరణ తక్కువగా ఉంటుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఉద్యోగులు తమ పైఅధికారులతోను పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. అనుకోని దూర ప్రయాణాలుంటాయి. ఉద్యోగార్ధులకు అవకాశాలు దొరకగలవు. సంప్రదింపులు, అగ్రిమెంటు వ్యవహారాలలో జాగ్రత్తగా ఉండండి. పెద్దమొత్తాలలో పెట్టుబడులు గాని, భాగస్వామ్య వ్యాపారాలు గాని చేయవద్దు. ఆదాయం తగ్గుతుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఉద్యోగులకు అధికారులతో సత్సంబందాలు నెలకొంటాయి. ఉద్యోగార్ధులకు అవకాశాలు లభించగలవు. బంధువులతో సోదరులతో సమస్యలు సర్దుబాటు చేసికొంటారు. ఆరోగ్యం బాగుంటుంది. వ్యాపారంలో ప్రోత్సాహకర పరిస్థితులుంటాయి. వృత్తి ఉపాధి పథకాలలో నిలద్రొక్కుకుంటారు. ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. చేపట్టిన పనులు నిదానంగా జరుగుతాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వ్యవసాయ, పారిశ్రామిక యజమానులకు పరిస్థితులు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఉద్యోగులకు పబ్లిక్‌తోను అధికారులతో సన్నిహితత్వం ఏర్పడుతుంది. స్థిరాస్తుల లావాదేవీలు ప్రస్తుతం చేయవద్దు. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. షేర్లు నిరుత్సాహం కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. ప్రభుత్వ అనుమతులు లభించగలవు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు మంజూరు కాగలవు. ఉద్యోగ బాధ్యతలను మంచి సామర్ధ్యంతో నిర్వహిస్తారు. దూర ప్రయాణాలుంటాయి. శుభకార్యాల ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. రావలసిన బాకీలు కొంత లభించడం, మంచి వార్తను వినడం జరుగుతుంది. కుటుంబ సౌఖ్యముంటుంది. ఆదాయ వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 13.1.2017 నుండి
తేది. 19.1.2017 వరకు

ఈ వారం కర్కాటక, సింహ, కన్య రాశులలో చంద్రుడు, సింహంలో రాహువు, కన్యలో గురువు, వృశ్చికంలో శని, ధనుస్సులో రవి బుధులు, 14తేది నుండి మకరంలో రవి, కుంభంలో కేతు కుజ శుక్రులు సంచరిస్తారు.

**పంచాంగము**

తేది 13 శుక్రవారము భోగి పండుగ

తేది 14 శనివారము సంక్రాంతి.
ఉత్తరాయణ పుణ్యకాల ప్రారంభం.
తేది 15 ఆదివారము కనుమ పండుగ.

ముహూర్తములు లేవు.

**పుష్య మాస కృష్ణపక్ష తిధులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 13 | శుక్ర | పాడ్యమి | సా॥ గం.4.12వ॥ |
| తేది. 14 | శని | విదియ | సా॥ గం.3.00వ॥ |
| తేది. 15 | ఆది | తదియ | సా॥ గం.2.15వ॥ |
| తేది. 16 | సోమ | చతుర్ధి | ప॥ గం.1.58వ॥ |
| తేది. 17 | మంగళ | పంచమి | ప॥ గం.2.10వ॥ |
| తేది. 18 | బుధ | షష్ఠి | ప॥ గం.2.56వ॥ |
| తేది. 19 | గురు | సప్తమి | సా॥ గం.4.08వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఉద్యోగులకు, అధికారులకు స్థానమార్పులు, విధి నిర్వహణలో సమర్ధత ఉంటుంది. దూర ప్రయాణాలు తప్పనిసరిగా ఉంటాయి. కొత్త వస్తువులు, విలువైన వస్తువులు సమకూర్చుకొంటారు. స్థిరాస్తుల లావాదేవీలందు అనుకూల పరిస్థితులుంటాయి. విద్యావృద్ధి, ఆరోగ్యం బాగుంటుంది. పట్టుదలతో చేపట్టిన పనులను జరుపుతారు. అవసరాలకు రావలసిన డబ్బులందుతాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఉద్యోగ బాధ్యతలలో సామర్ధ్యం, స్థానమార్పులుంటాయి. ముఖ్య విషయాలలో పెద్దల సలహాలను స్వీకరిస్తే మేలు జరుగుతుంది. రావలసిన బాకీలు పరిష్కారం కావడం, కోర్టు కేసులందు అనుకూలత ఉంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు. ఉద్యోగార్ధులకు ఆహ్వానాలు లభిస్తాయి. ఆర్ధిక ప్రణాళికలు పథకాలతో వ్యాపార పరిశ్రమ రంగాలను వృద్ధి చేస్తారు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

యజమానులకు వర్కర్లతో సమస్యలు రావచ్చును. స్థిరాస్తుల సమావేశాలలో పాల్గొంటారు. పెట్టుబడులకు మంచి అవకాశాలు లభిస్తాయి. షేర్ మార్కెట్ ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఆరోగ్య ఆహార విషయాలలో జాగ్రత్త అవసరం. అనుకోని ఆదాయం కొంత లభిస్తుంది. కుటుంబ వ్యవహారాలలో అనుకూలత తక్కువగా ఉంటుంది. మిమ్మల్ని విమర్శించే వారు పెరుగుతారు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

షేర్లు నిరుత్సాహపరుస్తాయి. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. అనుకున్న పనులు జరుగుతున్నా టెన్షన్ పడుతుంటారు. ఉద్యోగులు తమ అధికారులతోను, పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. ఆరోగ్యం బాగుంటుంది. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత బాగుంటుంది. కొత్త వస్తువులు సమకూర్చుకొంటారు. విద్యా ప్రగతి బాగుంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆస్తి వ్యవహారాలలోను, ఆర్ధిక లావాదేవీలందు జాగ్రత్త పడండి. కుటుంబసభ్యులతో అనుకూలత సరిగా ఉండదు. దైవ, సాంఘిక కార్యక్రమాలలో పాల్గొంటారు. అనుకున్న పనులు కార్యక్రమాలు తొందర తొందరగా పూర్తి చేయగలరు. ఉద్యోగులకు పనిభారం శ్రమ పెరుగుతుంది. అనవసర వ్యవహారాలలో తల దూర్చకండి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఉద్యోగ ప్రయత్నాలు చేసేవారికి మంచి అవకాశాలు లభించగలవు. అనుకోని ప్రయాణాలుంటాయి. సభలు సమావేశాలలో ప్రముఖ పాత్ర నిర్వహిస్తారు. పనులు సక్రమంగా జరుగుతున్నా టెన్షన్ పడుతుంటారు. ఆరోగ్యం బాగుంటుంది. స్థిరాస్తుల మీద కొంత ఆదాయం లభిస్తుంది. విద్యాప్రగతి బాగుంటుంది. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా ఉండి అభివృద్ధి బాగుంటుంది.

# పోలీసు కుటుంబాలకు చేయూత

**- అడిషనల్ ఎస్పీ బి.శరత్‌బాబు**



మృతిచెందిన పోలీసుల కుటుంబాలను అన్నివిధాలా ఆదుకుంటామని అడిషనల్ ఎస్పీ బి. శరత్‌బాబు అన్నారు. మృతిచెందిన ఇద్దరు పోలీసు కుటుంబాలకు ఆయన సోమవారం భద్రత ఎక్స్‌గ్రేషియా చెక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా, 5వ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ 13-10-2016న గుండెపోటుతో మృతిచెందిన ఏఎస్ఐ ఎస్‌కె మొహిద్దీన్‌బాషా కుటుంబానికి రావలసిన 4 లక్షల భద్రత ఎక్స్‌గ్రేషియా చెక్‌లను మృతుని భార్య నూర్జహాన్‌కు రూ.2లక్షలు, ఆయన కుమార్తె షమీమ్‌కు రూ.2లక్షలు అందజేశారు. అదేవిధంగా, అల్లూరు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ 23-7-2016న మరణించిన పినబోయిన సుబ్బనరసయ్య భార్య విజయలక్ష్మికి 1,90,650 రూపాయలు, కుమార్తె ప్రియాంకకు రూ.2లక్షల చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో బి.సెక్షన్ సూపరింటెండెంట్ సులోచన, బిసెక్షన్ గుమాస్తా ఎం.నరేంద్ర పాల్గొన్నారు.

# ఎస్ఆర్‌కెలో సంక్రాంతి వేడుకలు

నెల్లూరు, ఇస్కాన్ సిటీలోని డాక్టర్ ఎస్ఆర్‌కె నెక్స్ట్ జనరేషన్ స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలను 9వ తేదీ నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్‌లో 216 రకాల పిండివంటలు పెట్టారు. సాంప్రదాయబద్ద పిండివంటలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎంతో ఆసక్తిగా తిన్నారు. ఇక్కడ మిగిలిన ఆహార పదార్థాలను అనాథశరణాలయాలు, వృద్ధాశ్రమాలకు పంపించారు. స్కూల్ కరస్పాండెంట్ పి.కృష్ణమూర్తి, డైరెక్టర్ పి.దిలీప్‌కుమార్‌ల పర్యవేక్షణలో ఈ వేడుకలు ఎంతో సంతోషకరంగా జరిగాయి.

# 'రెయిన్‌బో'లో గేమ్స్ గాలా



నెల్లూరురూరల్ పరిధిలోని కలివెలపాలెం గ్రామంలో ఉన్న రెయిన్‌బో పాఠశాలలో ఆదివారం గేమ్స్ గాలా(క్రీడోత్సవం) అత్యంత వైభవంగా జరిగింది. ఈ పోటీలను నెల్లూరు నగర డీఎస్పీ వెంకటరాముడు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ సతీమణి సింధూర పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులకు తల్లిదండ్రులకు పలు క్రీడాంశాలలో పోటీలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ పద్మసుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ వి.రామగిరి, విద్యాసాగర్, ప్రీప్రైమరి ఇన్‌ఛార్జి ఫాతిమాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# విఆర్‌సిలో అకడమిక్ ఆడిట్




నెల్లూరులోని విఆర్ కళాశాలలో సోమవారం అకడమిక్ ఆడిట్‌ను నిర్వహించారు. అకడమిక్ అడ్వైజర్స్‌గా చిత్తూరు జిల్లా నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజిక్స్ అధ్యాపకుడు డాక్టర్ ఎం.భాస్కరరెడ్డి, శ్రీకాళహస్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర అధ్యాపకుడు డాక్టర్ కె.వెంకోబరావు, గూడూరు డిఆర్‌డబ్ల్యు జువాలజీ అధ్యాపకురాలు డాక్టర్ ఎం.భవాని విచ్చేసి కళాశాలలోని అన్ని విభాగాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. రికార్డుల నిర్వహణ పట్ల, అధ్యాపకుల పనితీరు పట్ల వారు సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విఆర్‌సి ప్రిన్సిపాల్ డాక్టర్ సివిఎస్ భాస్కర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్‌రావు, ఐక్యూఏసి కో-ఆర్డినేటర్ ఎం. గురుదేశ్వరరెడ్డి, యూజిసి కో-ఆర్డినేటర్ డాక్టర్ బాబర్ ఆలీ మొహిద్దీన్, న్యాక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, లైబ్రేరియన్ డాక్టర్ ఎన్.ప్రభాకర్, పి.డి ఎం.రవీంద్రబాబు, ఎన్‌సిసి అధికారి కె.శ్రీనివాసులు, పలు విభాగాల అధిపతులు పి.సుధాకర్, డాక్టర్ ఎం.పద్మప్రియ, వై.ఎల్లమందరావు, ఎం.రవీంద్రనాథ్, ఎం.రామిరెడ్డి, డాక్టర్ సి.వెంకట్రామయ్య, డాక్టర్ టి.వి రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజావాకర్స్ సంఘం సత్కారాలు



ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు చెలికాని సీతారామయ్య, కోశాధికారి శ్యామల శ్రీనివాసులురెడ్డి నెల్లూరుకు విచ్చేసిన సందర్భంగా జిల్లా ప్రజావాకర్స్ సంఘం ఆధ్వర్యంలో తుంగా నారాయణ రెడ్డి చేతులమీదుగా ఘనంగా సత్కరించారు. ఇటీవల నెల్లూరు పొదలకూరు రోడ్డులోని దయోసిన్ చర్చిలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా ప్రజావాకర్స్ సంఘం అధ్యక్షులు చలంచర్ల భాస్కర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. అనంతరం ఏరియా ఉపాధ్యక్షులు నేతాజీ సుబ్బారెడ్డి, 203 వాకర్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మైథిలి మనోహర్‌రెడ్డి, జడ్పీ వాకర్స్ అధ్యక్షులు చెలంచర్ల భాస్కర్ రెడ్డిలను, వాకర్స్ పూర్వ గవర్నర్లు దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్, డా॥ అంకిరెడ్డిలను సత్కరించారు. ఈ సందర్భంగా గొల్లపాళెం ఆశ్రమ పాఠశాల, వెంగళరావునగర్ నగరపాలక ఉన్నతపాఠశాల, సొసైటి ఫర్ సోషల్ ఛేంజ్ పుస్తక ప్రచురణార్థం రూ.5వేలు వంతున, నిరుపేద విద్యార్థి మనోహర్ ఆపరేషన్‌కు రూ.10వేలు, జెడిఆర్ ప్రాథమిక పాఠశాలకు రూ.10 వేలు జడ్పీ వాకర్స్ తరఫున అధ్యక్షులు భాస్కరరెడ్డి సౌజన్యంతో ఇంటర్నేషనల్ అధ్యక్షులు ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వాకర్స్ ప్రధానకార్యదర్శి జె.యస్.ఆంజనేయులు, బిరదవోలు రామిరెడ్డి, జడ్పీ వాకర్స్ సభ్యులు, పలు వాకర్స్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు సహకరించిన చర్చిఫాదర్‌ను కృతజ్ఞతాపూర్వకంగా సత్కరించారు.

## ఇంటర్నేషనల్ వాకర్స్ ఛైర్‌పర్సన్‌గా శ్రీనివాసరావు

2017 సంవత్సరానికిగాను ఇంటర్నేషనల్ వాకర్స్ ఛైర్‌పర్సన్‌గా మళ్ళీ మందువ శ్రీనివాసరావు నియమితులయ్యారు.

# వాకర్స్‌కు అల్పాహార విందు



నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు తండ్రి నలుబోలు మల్లయ్యనాయుడు 6వ వర్ధంతిని పురస్కరించుకుని ఏసి స్టేడియంలో వాకర్స్‌కు మంగళవారం అల్పాహార విందు ఏర్పాటు చేశారు. అదేవిధంగా, బాలాజీ నగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమంలో పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో బలరామయ్య నాయుడుతో పాటు, ఏసి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వేలూరు రంగారావు, స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి పొన్నం రవిచంద్ర, సభ్యులు డాక్టర్ అంకిరెడ్డి, హైటెక్ ఫార్మా ఎన్.వి రమణారెడ్డి, షణ్ముఖరామ్, డాక్టర్ దొర స్వామినాయుడు, రాజా రమేస్, హరిరావు పాల్గొన్నారు.

## బీసీ అడ్వకేట్స్

## రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా గిద్దలూరు



బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా గిద్దలూరు వెంకట నరసయ్యను ఎన్నుకున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వల్లపు కృష్ణ ఆదివారం తెలిపారు. గుంటూరులో శనివారం జరిగిన కార్యవర్గ సమావేశంలో నరసయ్యను ఎన్నుకున్నారు. అసోసి యేషన్ జిల్లా అధ్యక్షుడు నక్కల నాగరాజు, కార్యదర్శి దాసరి రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యక్షుడు దాసరి మురళి అభినందనలు తెలిపారు.

## నేతాజీలో సంక్రాంతి సంబరాలు



నెల్లూరు శ్రీనివాస అగ్రహారంలోని శ్రీ నేతాజీ ఫైలెట్ స్కూల్‌లో ఈ నెల 7వ తేదీ సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. స్కూల్ కరస్పాండెంట్ ఎం.వి.సుబ్బారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ వాణి, ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్న, డైరెక్టర్ నరేంద్రరెడ్డి, హెడ్ మాస్టర్ నరశింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉత్తమ గురువులకు సత్కారం



విజయవాడలోని సాంస్కృతీ సమాఖ్య (యువ సాహితీ వికాస వేదిక), సమత సేవా సమితి, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 8న ఉత్తమ గురువులకు ఘన సత్కారం జరిగింది. సావిత్రిబాయిపూలే 186వ జయంతిని పురస్కరించుకుని మహిళా ఉపాధ్యాయినులకు, మహాత్మా జ్యోతిరావుపూలే పేరుతో ఉపాధ్యాయులకు ఈ సత్కారాలను అందించారు. జాతీయస్థాయిలో 29మంది గురువులను ఎంపిక చేసి విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో వారికి ఘనసన్మానం చేశారు. ఈ సత్కారాలు అందుకున్న ఉత్తమ గురువుల్లో నెల్లూరుకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు వుండడం విశేషం. నెల్లూరుకు చెందిన కెవిఎన్ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు గుండాల నరేంద్రబాబు, ఎస్‌విఆర్ ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని ఎన్‌హెచ్‌డిఎల్ఎన్ లలిత ఈ ఉత్తమ పురస్కారాలను అందుకున్నారు. సాంస్కృతీ సమాఖ్య ప్రధాన కార్యదర్శి వి.శిరీష్‌కుమార్, గోళ్ళ నారాయణ, చింతా వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ వెలమ సిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

## వెనుకబడిన కులాల జేఏసి ఆధ్వర్యంలో...



దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయిపూలే 186వ జన్మదిన వేడుకలు నెల్లూరులో ఇటీవల ఘనంగా జరిగాయి. జిల్లా వెనుకబడిన కులాల జాయింట్ యాక్షన్ కమిటీ ప్రెసిడెంట్ గంపల దొరస్వామి ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ పూర్వ సమావేశమందిరంలో జరిగిన ఈ వేడుకల్లో జిల్లా పరిషత్, మండల పరిషత్‌ల పరిధిలో విద్యారంగంలో ఉత్తమ సేవలందిస్తున్న 30 మంది ఉత్తమ ఉపాధ్యాయినులను ఎంపిక చేసి వారిని ఘనంగా సన్మానించారు. గంపల దొరస్వామి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ కల్లూరి నాగేశ్వరరావు, సక్కా నాగేశ్వరరావు, సాగర్, బిసి జెఏసి సలహాసంఘం ఛైర్మెన్ మన్నేపల్లి నాగేశ్వరరావు, డి.జనార్దన్, దోనేపూడి కోటేశ్వరరావు, ఆర్.కోటిసింగ్, కిన్నెర మాలకొండయ్య, భార్గవరాముడు, జి.వి.నరసయ్య, శివాజీబోధి, ఎ.ప్రతాప్‌లతో పాటు మహిళా ప్రముఖులు రామతులసి, వరలక్ష్మి, విజయలక్ష్మి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు పెద్దపండుగ

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలంతా కూడా ఇబ్బంది పడింది పెద్దనోట్ల రద్దు మూలంగానే! పేదలను ఉద్ధరించడం కోసమే పెద్దనోట్లను రద్దు చేసానని ప్రధాని ఇప్పటికీ చెబుతున్నారు. ఆ ఉద్ధరించే మార్గం ఎలా ఉంటుందో చెప్పడం లేదు. పెద్దనోట్ల రద్దు విషయంలో ప్రధాని మోడీ అనుకున్నదొకటి, అయ్యిందొకటి! మోడీ నిజాయితీని ఇక్కడ శంకించలేం! తనదైన శైలి పనితీరు చూపాలనే ఏ నాయకుడూ ఒడిగట్టలేని సాహసానికి పూనుకున్నాడు. తన క్యాబినెట్‌కు కూడా తెలియకుండా పెద్దనోట్ల రద్దు నిర్ణయం తీసుకున్నాడు. ఆయన రద్దు నిర్ణయాన్ని విని బీజేపీ నాయకులే నోరెళ్లబెట్టారు. ఈ మోడీ ఏంటి మన కొంపే ముంచాడని భావించిన నాయకులు కూడా వున్నారు. పెద్దనోట్ల రద్దు, కొత్తనోట్ల మార్పిడి గడువు తర్వాత దాదాపు నాలుగైదు లక్షల కోట్లు బ్లాక్‌మనీ బ్యాంకులకు రాకుండా ఆగిపోతుందని, ప్రజలు డిజిటల్ కరెన్సీ వైపు మళ్లుతారని, అన్ని స్థాయిల్లో అవినీతి ఆగిపోతుందని, ఎన్నికల్లో ధన ప్రభావం తగ్గుతుందని, నకిలీ కరెన్సీ పీడ వదిలి ఉగ్రవాదం చీడ విరుగుడవుతుందని మోడీ ఆశించారు. కాని ఆయన ఆశలకు, వాస్తవ ఫలితాలకు చాలా తేడా వుంది. దేశంలో బ్లాక్ అంతా వైట్ అయిపోయింది. కాని పెద్దనోట్ల రద్దు మూలంగా దేశ ఆర్థిక వ్యవస్థ దారుణంగా దెబ్బతింది. లక్షలాది మంది ఉద్యోగాలు ఊడుతున్నాయి. సంస్థలు మూతపడుతున్నాయి.

పన్నుల రూపంలో కేంద్ర ప్రభుత్వానికి ఆదాయం పెరిగిందని ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ చంకలు గుద్దుకుంటున్నారు గాని, ఎన్ని కుటుంబాలు రోడ్డునపడుతున్నాయో గమనించడం లేదు. అసలు దేశంలో బ్లాక్‌మనీ అన్నది కరెన్సీ రూపంలో చాలా తక్కువగా వుంది. లక్షల కోట్ల బ్లాక్‌మనీ ఉండేది బినామీ ఆస్తుల రూపంలో! మోడీ పెద్దనోట్ల రద్దు కంటే కూడా బినామీ రాయుళ్ల భరతం పట్టి ఉంటే దేశ ఆర్థిక వ్యవస్థ పరిస్థితి ఈరోజు చాలా మెరుగ్గా ఉండేది.

పెద్దనోట్ల రద్దు మూలంగా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. జరిగిన కాలాన్ని, జరిగిపోయిన నష్టాన్ని ఎలాగూ భర్తీ చేయలేము. పెద్దనోట్ల రద్దు మూలంగా పేదలకు ఆశించిన ప్రయోజనం ఉండకపోవచ్చు.

కానీ మోడీ అనుకుంటే ఈ దేశంలో ఒకటి మాత్రం సాధ్యం అవుతుంది. చదువు, వైద్యం, ఆహారం, వసతి ప్రజల ప్రాథమిక హక్కులు. ఈరోజు దేశంలో ఆహార సమస్య లేదు. 20, 30ఏళ్ల క్రితం దేశంలో ఆహార ధాన్యాల కొరతే పెద్ద సమస్య. ఇప్పుడు అడుక్కునేవాడికి కూడా తిండికి కరువు లేదు. ఇక ప్రతి ఒక్కరికీ వసతి అనే మార్గంలో కూడా చాలా పురోగతి సాధించాం. అయితే ప్రతి ఒక్కరికీ విద్య, వైద్యం ఉచితంగా అందించాలన్న ఆశయం మాత్రం ఈ దేశంలో నీరుగారిపోతోంది. ఇది మధ్యతరగతి మహాభారతం. నూటికి 70మంది మధ్యతరగతి ప్రజలే! ఈరోజు వారికి చదువులు భారమయ్యాయి. ఆసుపత్రుల ఖర్చులు మోయలేనంత బరువయ్యాయి. సర్కారు చదువులు చట్టుబండలయ్యాయి. రిక్షా పుల్లర్‌కు సైతం సర్కార్ చదువు మీద నమ్మకం లేక ప్రైవేట్ స్కూళ్ళలో తమ పిల్లలను చేర్పిస్తున్నాడు. ఒక పిల్లోడి చదువుకు ఎల్‌కెజి నుండే వేలతో ఖర్చు మొదలవుతుంది. ఇంటర్, ఎంసెట్ వద్దకు వచ్చేసరికి లక్షలు, ఎంబిబిఎస్, పీజీ కాడికి పోయేసరికి కోట్లలో ఉంటుంది. ఒక మధ్యతరగతి వ్యక్తి ఇన్ని కోట్లు పెట్టి తన బిడ్డను డాక్టర్ లేదా ఇంజనీర్ చేసుకోగలడా?

ప్రభుత్వ ఆసుపత్రులు ఎంత ఘోరంగా ఉంటాయో తెలిసిందే! ఒక రోగంతో ఆసుపత్రికిపోతే నాలుగు కొత్త రోగాలతో బయటకు రావాలి. ఇంత అధ్వాన్నంగా ఉండే ప్రభుత్వ ఆసుపత్రులకు ఎవరు మాత్రం పోగలరు. ప్రతి ఒక్కరికీ కార్పొరేట్ వైద్యమే దిక్కవుతోంది! కార్పొరేట్ ఆసుపత్రులలో ఖర్చుల సంగతి చెప్పాలా? కోట్లు ఖర్చుపెట్టి కార్పొరేట్ ఆసుపత్రులు కట్టుకున్న వాళ్ళు వైద్యంతో వ్యాపారమే చేస్తారు. వాళ్ల నుండి సామాజిక సేవ ఆశించడం కూడా అత్యాశే అవుతుంది. ఈ దేశంలో సమన్యాయం అనేది ఒక్క రోగాల విషయంలోనే అమలవుతుంది. పేదోడికైనా, పెద్దోడికైనా రోగాలలో మినహాయింపు లేదు. అయితే పెద్దోడు ఎన్ని లక్షలు ఖర్చైనా కార్పొరేట్ ఆసుపత్రులలో మెరుగైన వైద్యచికిత్స పొందగలడు. మరి పేదోడికి అంత స్థోమత ఎక్కడిది? ఈరోజు దేశంలో ఎక్కువశాతం మంది ప్రజలు తమ అవసరాలను తగ్గించుకుని రోజూ తమ సంపాదనలో అంతో ఇంతో పొదుపు చేసేది బిడ్డల చదువుల కోసం, పెద్దజబ్బులు వస్తే ఆసుపత్రుల ఖర్చుల కోసం.

పెట్టుబడిదారి దేశాలలో, ప్రైవేట్ రంగం రాజ్యమేలే దేశాలలో సైతం విద్య, వైద్యం ప్రభుత్వం ఆధీనంలో ఉంటాయి. ప్రజలకు ఇవి రెండూ కూడా ఉచితంగా అందుతుంటాయి. భారతదేశంలోనే ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన రంగాలు ప్రైవేట్ ఆధీనంలోనూ, ప్రైవేట్ ఆధీనంలో ఉండాల్సిన అంశాలు ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి. వీటిలో విద్య, వైద్యం చాలా ప్రాధాన్యత కలిగినవి. పేద, మధ్య తరగతి ప్రజల సంపాదనను సగం ఈ రెండే హరిస్తున్నాయి. దేశంలో ప్రభుత్వ విద్య, వైద్యం క్రమక్రమంగా కనుమరుగవుతోంది. కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి ఈ రెండు రంగాలు పూర్తిగా వెళ్లిపోతున్నాయి.

ప్రధాని నరేంద్రమోడీకి దేశం పట్ల, పేద ప్రజల పట్ల చిత్తశుద్ధే ఉంటే ముందు విద్య, వైద్య రంగాలపై దృష్టిపెట్టాలి. ఈ రెండింటిని ప్రభుత్వ ఆధీనంలోకి తేవాలి. దేశ ప్రజలకు మెరుగైన చదువులు, ఆధునిక వైద్య సేవలను ఉచితంగా అందించేలా ఈ రెండు రంగాలను జాతీయీకరణ చేయాలి. దేశ ప్రజలకు ఈ వరాన్ని ఆయన అందిస్తే ప్రజలు పెద్దనోట్ల రద్దు కష్టాలను మరచిపోవడమే కాదు, నరేంద్రమోడీని ఆజన్మాంతం తమ గుండెల్లో పెట్టుకుంటారు. పెద్దనోట్ల రద్దు వంటి సాహసోపేత నిర్ణయం తీసుకున్న మోడీ వల్ల మాత్రమే ఇది సాధ్యమవుతుంది కూడా! పేదలకు ఆయన మేలు చేయాలనుకుంటే ఆయన ముందున్న అత్యుత్తమ మార్గమిది!

ఇకనన్నా వట్టిమాటలు కట్టిపెట్టి మోడీ ఈ దిశగా త్వరలోనే ఓ సంచలన నిర్ణయం తీసుకుంటారని భారతావని ఎదురుచూస్తోంది. ఉచిత విద్య, వైద్యం అందుబాటులోకి వచ్చినప్పుడే పేదప్రజలకు పెద్దపండుగ!

# కాకాణి కథ ముగిసింది

(మొదటి పేజీ తరువాయి)

వైరం తీవ్రంగా వుందో గమనించుకుని ఆ ఇద్దరిలో ఒకరిని సంప్రదించి తన వద్ద ఆ వ్యక్తి ప్రత్యర్థికి సంబంధించిన ఆస్తుల వివరాలు వున్నాయని, తనకు కొంత మొత్తం ముట్టచెప్తే డాక్యుమెంట్ ప్రూఫ్‌లతో కూడా అందజేస్తానని బేరాలు మొదలుపెడతాడు.

ఇదే క్రమంలో కొన్నాళ్ల క్రితం ఆనం సోదరుల విదేశీ ఆస్తులు చరిత్ర తన వద్ద వుందని మేయర్ అజీజ్‌ని, ఆత్మకూరు ఎమ్మెల్యే గౌతంని సంప్రదించినట్లు కూడా సమాచారం. జె.సి సోదరుల ఆస్తుల వివరాలు ఇస్తానంటూ అనంతపూర్‌కి చెందిన ప్రభాకర్‌చౌదరిని కూడా ఈ ఘనుడు కలిసినట్లుగా తెలుస్తోంది. అయితే గౌతం లేదా అజీజ్‌లతో పాటు ప్రభాకర్‌చౌదరిలు ఈ ఉచ్చులో పడలేదు. సోమిరెడ్డిని ఏదో ఒక విధంగా రాజకీయంగా, వ్యక్తిగతంగా భ్రష్టుపట్టించి నైతికంగా చంద్రమోహన్‌రెడ్డిని నవ్వులపాలు చేయాలనే కసితో రగిలిపోతున్న కాకాణి, ఈ మణిమోహన్‌కి చుక్కానిలా కనపడ్డాడు. మంచి సమయం చూసి కాకాణిని సంప్రదించాడు. మొదలే కోపంతో, బాధతో, ఆవేశంతో రగిలిపోతుండిన కాకాణి వెంటనే మణిమోహన్‌తో డీల్ కుదుర్చుకుని అసలువే అనుకున్న నకిలీ పత్రాలను తన చేతికి చిక్కించుకున్నాడు. అక్కడ నుండి జరిగిందంతా అందరికీ తెలిసిన కథే!

సోమిరెడ్డి చేసిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు చిత్తూరుజిల్లా అడవి కోయంబేడుకు చెందిన పసుపులేటి చిరంజీవి అలియాస్ మణిమోహన్‌ని అతనికి సహకరించిన టైపిస్టు టి.వెంకటకృష్ణన్, నకిలీ రబ్బరుస్టాంపులు తయారు చేసి ఇచ్చిన జి.హరిహరన్‌లను అరెస్టు చేశారు. కాకాణి, మణిమోహన్‌ల మధ్య నడిచిన కాల్ డేటాతో పాటు వాట్సప్‌లు, మెసేజ్‌లు కూడా స్వీకరించారు. మరోవైపు తనను అరెస్ట్ చేయొద్దంటూ స్క్వాష్ పిటిషన్ వేసిన గోవర్ధన్‌రెడ్డిని అరెస్టు చేయకుండా రోజూ 10.30 నుండి 5గంటల మధ్య విచారించమని హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం పోలీసులు రోజూ కాకాణిని పోలీసుస్టేషన్లో విచారించి తమకున్న అనుమానాలన్నీ నివృత్తి చేసుకున్నారు. కాకాణి చేసిన ఆరోపణలకీ పోలీసుస్టేషన్లో ఇస్తున్న సమాధానాలకీ పొంతన లేకపోవడంతో కాకాణి ఆరోపణలన్నీ కాకమ్మ కథలుగా నిర్ధారణకి వచ్చేశారు.

బహుశా రాష్ట్ర చరిత్రలోనే ఇదో పెద్ద సంచలనం. నెల్లూరుజిల్లా రాజకీయ రంగంలో సైతం ఇదో చెరిగిపోలేని మచ్చే. ఓవైపు నకిలీ మద్యం కేసులో మాఫియా డాన్‌లాంటి అప్పుతో సంబంధాలు, మరోవైపు రెడ్‌శాండల్ ముఠాతో లావాదేవీలు, వీటితోపాటు పోలీస్‌స్టేషన్లలో దొమ్మి కేసులు, భూఆక్రమణ కేసులూ ఇవన్నీ విచారణలో వుండగానే దర్యాప్తు జరుగుతుండగానే అంతర్జాతీయ నకిలీ డాక్యుమెంట్ల ముఠాతో కలిసి సోమిరెడ్డిపై ఆరోపణలు. గత వారం 'లాయర్' ప్రస్తావించినట్లుగా కాకాణి ప్రస్థానం ఎంతటి సంచలనమో, పతనం కూడా అంతే సంచలనం కాబోతోంది. రాజకీయాలలో కక్షలుండొచ్చు, ద్వేషాలుండొచ్చు, పరస్పర దూషణలు ఉండొచ్చు... కాని, అవన్నీ పార్టీల వరకే పరిమితమైతే బాగుంటుంది. వ్యక్తిగత దూషణలకు, కుటుంబ ద్వేషాలకు దారితీస్తే పరిస్థితులు గందరగోళంగా మారుతాయి. ఇలాంటి సంఘటనే కాకాణిది. ఆవేశం అనర్థదాయకం అన్న పెద్దల మాటను పెడచెవిన పెట్టి అడ్డంగా దొరికిపోయాడు. తన కథకు తానే మంగళం పాడుకున్నాడు. చట్టం తనపని తాను చేసింది. ఇక న్యాయం తనపని తాను చేసుకుపోతుందని వేరే చెప్పనక్కర లేదు.

సోమిరెడ్డి మనోవేదనను గుర్తించి ఈ కేసును శరవేగంగా శోధించి ఛేధించిన నెల్లూరురూరల్ డిఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి, రూరల్ సిఐ దుర్గాప్రసాద్, కృష్ణపట్నం పోర్టు సిఐ శ్రీనివాసరావు, కావలి రూరల్ సిఐ అశోక్‌వర్ధన్, కృష్ణపట్నం పోర్టు యస్.ఐ విశ్వనాథరెడ్డిలను జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ అభినందించారు.

# నోట్ల రద్దుపై శ్వేతపత్రం విడుదల చేయాలి

## - డిసిసి అధ్యక్షులు పనబాక కృష్ణయ్య




నోట్ల రద్దుపై ఉన్న నిజానిజాలపై ఎన్‌డిఏ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిసిసి అధ్యక్షులు పనబాక కృష్ణయ్య డిమాండ్ చేశారు. బ్యాంకుల్లో, ఏటిఎంలలో నగదు తీసుకోవడంపై ఉన్న ఆంక్షలు పూర్తిగా తొలగించాలని సోమవారం నెల్లూరు ఇందిరా భవన్ నుండి కార్యకర్తలు, నాయకులతో ఖాళీ ప్లేట్లతో ప్రదర్శన ర్యాలీగా బయలుదేరి గాంధీ విగ్రహం వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పనబాక కృష్ణయ్య 8 డిమాండ్లను విడుదల చేసి ఈ డిమాండ్లను కేంద్రప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలన్నారు. లేకుంటే కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో మరిన్ని ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం పిసిసి సమన్వయ కమిటి సభ్యులు సి.వి.శేషారెడ్డి, పిసిసి ఉపాధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి, పిసిసి ప్రధానకార్యదర్శి చెంచలబాబుయాదవ్, జిల్లా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి లతారెడ్డి మాట్లాడారు. గాలాజు శివాచారి, ఆసిఫ్‌పాషా, షేక్ ఫయాజ్, శీలం తిరుపయ్య, పత్తి సీతారాంబాబు, కేశవ నారాయణ, షేక్ ముమిత్‌షా, రావూరు వెంకటరమణయ్య, బాలసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.




# శతమానం భవతి

## అరుదైన అంతర్జాతీయ రికార్డు దిశగా ఇస్రో



పెద్దనోట్ల రద్దుచేసినా, దేశ రాజకీయాలు ఎలా వున్నా, నాయకులు, మన పాలకులు ఎంత రోతగా తయారైనా... ఇవేమీ పట్టించుకోకుండా తమ పని తాము చేసుకుంటూ అగ్రదేశాలకు ధీటుగా నిలుస్తున్న ఏకైక సంస్థ భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో. అత్యంత తక్కువ కాలంలోనే అంతరిక్ష ప్రయోగాలలో అగ్రదేశాల సరసన నిలిచింది. అమెరికా, రష్యా వంటి దేశాలు ఒకటికి నాలుగుసార్లు ప్రయోగాలు జరిపి విజయవంతమైన ఉపగ్రహాలను ఇస్రో ఒకే ఒక్క ప్రయోగంతో విజయవంతం చేసింది. అంతే కాదు, ఖర్చులోనూ ఎంతో పొదుపుగా ఉపగ్రహాలు తయారు చేస్తూ పెద్ద దేశాలకు గట్టి సవాలు విసురుతోంది. అతి తక్కువ ఖర్చుతో ఉపగ్రహాలను ప్రయోగిస్తూ, విదేశీ అంతరిక్ష వాణిజ్యాన్ని సైతం ఆకర్షిస్తోంది.

ఈ పరంపరలోనే మరో అనితర సాధ్యమైన విజయం వైపు ఇస్రో అడుగులు వేస్తోంది. ఇప్పటివరకు ఏ దేశం ప్రయోగించని విధంగా ఒకే రాకెట్ ద్వారా 103ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టడానికి సన్నాహాలు చేస్తోంది. మొదట 83 ఉపగ్రహాలను ప్రయోగించాలనుకున్నప్పటికీ సెంచరీ కొట్టాలన్న లక్ష్యంతో ఆ సంఖ్యను 103 ఉపగ్రహాలకు పెంచింది. ఫిబ్రవరి నెలలో ఈ ప్రయోగాన్ని నిర్వహించనున్నారు. తేదీ ఇంకా ఖరారు కాలేదు. ఈ ప్రయోగం విజయవంతం కావాలని కోరుతూ దేశవ్యాప్తంగా యువత ర్యాలీలు కూడా నిర్వహించనున్నారు. ఈ అరుదైన అంతరిక్ష ప్రయోగానికి మన నెల్లూరుజిల్లా శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్ వేదిక కావడం నెల్లూరీయులుగా మనకు గర్వకారణం.

## 22వ వర్ధంతి



జననం: 08-11-1930 మరణం: 18-01-1995

### స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి

వ్యవస్థాపకులు

**లాయర్**
తెలుగు వారపత్రిక

మహనీయుని మహితాత్మకు మా నివాళి.

లాయర్ సిబ్బంది కుటుంబసభ్యులు




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com